'ఎర్త్‌సైన్స్'లో ఈ ఏడాది

రెండు కోర్సులే



- జియాలజి, ఎన్విరాల్‌మెంటల్ సైన్స్‌లో అడ్మిషన్లు
- తరగతుల నిర్వహణకు 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమాలు

6

'స్థానిక'మే లక్ష్యంగా..

చేరికల పర్వానికి తెర లేపిన కాంగ్రెస్





హైదరాబాద్ గాంధీభవన్‌లో మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావుకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న పీసీసీ చీఫ్ మహేష్, పక్కన డిప్యూటీ సీఎం భట్టి

గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు ముందు ఉమ్మడి జిల్లాలోని వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు 'హస్తం'గూటికి చేరడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా ఆయా ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు భారీ ఆధిక్యాలు దక్కించుకున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సాహంతోనే స్థానిక ఎన్నికలకు సిద్ధమవుతున్న అధికార పార్టీ స్థానిక ఎన్నికల్లో సత్తా చాటడమే లక్ష్యంగా.. సాధ్యమైనంత వరకు ఏకగ్రీవాలు చేసుకునేలా వ్యూహరచన చేస్తోంది. ఈ క్రమంలో విపక్ష పార్టీలకు చెందిన నేతలు, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలను చేర్చుకునేలా పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలోనే మధిర మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు బీఆర్ఎస్‌కు గుడ్‌బై చెప్పి.. పలువురు నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి కాంగ్రెస్ గూటికి చేరారు. దీంతో అధికారం కోల్పోయిన అనంతరం నిస్తేజంలో ఉన్న గులాబీ దళంలో.. గుబులు మొదలైంది.

- విపక్ష పార్టీల నేతలను చేర్చుకునేందుకు వ్యూహాలు
- బీఆర్ఎస్‌లో మొదలైన గుబులు
- హస్తం గూటికి చేరిన మాజీ ఎమ్మెల్యే కొండబాల
- పలువురు బీఆర్ఎస్ నాయకులు, మాజీ ప్రతినిధులు కూడా..

ఖమ్మం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పదేళ్ల పాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ గత అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్య విజయాన్ని సొంతం చేసుకుంది. అదే జోష్‌ను లోక్‌సభ ఎన్నికల్లోనూ చూపించింది. అయితే ఆయా ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరడం ద్వారా ఉమ్మడి జిల్లాలో తొమ్మిది అసెంబ్లీ, రెండు లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆ పార్టీ భారీ ఆధిక్యాలు సొంతం చేసుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ మెజారిటీలు సాధించిన విషయం తెలిసిందే. అయితే ఈ లెక్కలను బేరీజు వేసుకుంటున్న కాంగ్రెస్ అధిష్ఠానం.. త్వరలో జరిగే గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మునిసిపల్, సహకార సంఘాల ఎన్నికల్లో పైచేయి సాధించడం.. అది కూడా ఎక్కువ స్థానాలను ఏకగ్రీవం చేసుకునేలా వ్యూహాలు రచిస్తోంది. ఈ నేపథ్యంలోనే విపక్ష బీఆర్ఎస్‌తో పాటు ఇతర పార్టీలనుంచి నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులను పార్టీలో చేరేలా ప్రోత్సహిస్తోంది. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చేరికల పర్వం మొదలైంది.

గులాబీ శ్రేణుల్లో అంతర్మథనం..

స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అధికార కాంగ్రెస్ చేరికలను ప్రోత్సహిస్తుండటంతో ప్రతిపక్ష బీఆర్ఎస్‌లో గుబులు మొదలైంది. కొద్దిరోజులుగా మధిర మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు కాంగ్రెస్‌లో చేరతాన్న ప్రచారం జరగ్గా.. ఆయన సోమవారం మధిర మార్కెట్ కమిటీ మాజీచైర్మన్, పలువురు స్థానిక సంస్థల మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌పార్టీలో శీలం సిద్దారెడ్డి శిష్యుడిగా రాజకీయాల్లోకి ప్రవేశించిన కొండబాల సర్పంచ్‌గా, సొసైటీ అధ్యక్షుడుగా తన రాజకీయ జీవితం ప్రారంభించి టీడీపీలో చేరి డీసీసీబీ చైర్మన్‌గా, భద్రాచలం దేవస్థానం చైర్మన్ అయ్యారు. టీడీప అభ్యర్థిగా మధిర శాసనసభ నుంచి పోటీచేసి గెలిచారు. ఆతర్వాత టీడీపీ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు.

(.. మిగతా 6వ పేజీలో)



నీటితొట్టిలో పడి.. రెండున్నరేళ్ల బాలిక మృతి

జూలూరుపాడు మండలం పెద్దతండాలో సంఘటన

7

విద్యుదాఘాతంతో ఇద్దరి కన్నుమూత

కరకగూడెం, చింతకాని మండలాల్లో ఘటనలు

'కల్లూరు ఆశ్రమం'లో కలకలం

- గిరిజన వసతి గృహంలో కిచిడీ తిని 37మంది బాలికలకు అస్వస్థత
- వంట తయారీలో నాణ్యత పాటించకపోవడమే కారణం
- చికిత్స అందించిన వైద్యులు.. కోలుకున్న బాలికలు
- నిర్వాహకులపై సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి ఆగ్రహం
- విద్యార్థినులను స్వయంగా పరీక్షించిన ఎమ్మెల్యే



ఆసుపత్రిలో బాలికలను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : అది ఖమ్మం జిల్లా కల్లూరులోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల వసతి గృహం. అక్కడి వంటవారు సోమవారం ఉదయం అల్పాహారంగా తయారు చేసిన కిచిడీ తిన్న 37 మంది బాలికలు పాఠశాలకు వెళ్లిన అనంతరం అస్వస్థతకు గుర య్యారు. దీంతో వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలి ంచగా.. వైద్యులు తక్షణమే చికిత్స అందించడంతో వారు కోలుకున్నారు. సోమవారం ఈ వసతి గృహంలో 86మంది విద్యార్థులుండగా వారి కోసం ఉదయం అల్పాహారంగా కిచిడీ తయారు చేశారు. ఉదయం 8:30 గంటల సమయంలో 37మంది బాలికలు ఆ కిచిడీని తిని 9 గంటల తర్వాత పాఠశాలకు వెళ్లారు. వారు పాఠశాలకు వెళ్లిన అరగంట తర్వాత ఒక్కొక్కరుగా కడుపు వికారం, నొప్పి, వాంతులు కావటం, ఆయాసం లాంటి లక్షణాలతో అస్వస్థతకు గురవగా. వారందరినీ స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా.. వారికి వైద్యులు, అక్కడి సిబ్బంది తక్షణమే వైద్యం అందించడంతో వారు కోలుకున్నారు. అయితే ఈ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలోని వసతి గృహంలో కొద్ది రోజులుగా నాసిరకమైన ఆహారం అందిస్తున్నారని, తాము తినలేక పోతున్నామని పలువురు విద్యార్థినులు వాపోతున్నారు. అన్నం సక్రమంగా ఉడికించడం లేదని, పలుకుగా ఉంటోందని, సాంబారు, కూరల్లో నాణ్యత లోపించిందని వారు చెబుతున్నారు. ఇదేంటని వంట వారిని అడిగితే తమపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కూడా కిచిడీ సక్రమంగా ఉడకలేదని, తాము అల్పాహారంగా తిన్న అరగంటలోనే ఇలా అయిందని వారు వివరించారు. బాలికలు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న కల్లూరు డివిజన్ సబ్‌కలెక్టర్ అజయ్‌యాదవ్.. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికలను పరామర్శించి అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అయితే అస్వస్థతకు గురైన విద్యార్థులను ఏఎంసీ చైర్మన్ బాగం నీరజదేవి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుమర్తి చందర్‌రావుతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు తమ సొంత వాహనాల్లో స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే అస్వస్థతకు గురైన విద్యార్థినులకు సీహెచ్‌సీ, పీహెచ్‌సీ వైద్యాధికారులు రమేష్, నవ్యకాంత్, అఖిల వినీత్, విశ్వాస్‌లతో పాటుగా వైద్య సిబ్బంది శ్రమించి సత్వర వైద్యం అందించడంతో చిన్నారులు కోలుకున్నారు. బాలికల ఆశ్రమ పాఠశాల లో మరో రెండు రోజుల పాటు వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని వైద్యాధికారి నవ్యకాంత్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. పాఠశాల ప్రాంగణంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన వసతిగృహ అధికారులను సూచించారు.

బాలికలను పరామర్శించిన ఎమ్మెల్యే రాగమయి

కల్లూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పరామర్శించారు. మెరుగైన వైద్యం

(..మిగతా 6వ పేజీలో)



ఈసీజీ పరీక్ష గది వద్ద క్యూ కట్టిన రోగులు

ఉన్నది పది.. పనిచేసేది ఒక్కటి!

ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో పనిచేయని ఈసీజీ మిషన్లు



తాళం వేసి ఉన్న ఎక్స్‌రే గది

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రికి నిత్యం 1,600 నుంచి 2వేల మంది రోగులు వస్తుంటారు. ఆయా ఓపీ విభాగాల్లో వారిని పరీక్షించే వైద్యులు అవసరమైన వారికి ఈసీజీ రాస్తుంటారు. కానీ గుండెపోటు సమస్య, కొట్టుకునే విధానాన్ని పరీక్షించే ఈసీజీ మిషన్లు పనిచేయడం లేదు. జిల్లా ఆస్పత్రిలో ఐసీయూ, క్యాజువాలిటీ, ఎంసీహెచ్, కార్డియాలజీ, ఎక్స్‌రే మిషన్ ప్లాంట్ వద్ద ఇలా పది విభాగాల్లో ఈసీజీ మిషన్లు ఉన్నా అవన్నీ మూలనపడ్డాయి. కేవలం ఎక్స్‌రే ప్లాంట్ వద్ద మాత్రమే ఈసీజీ తీస్తున్నారు. దాంతో రోజూ 100 నుంచి 120మందికి మాత్రమే ఈసీజీలు తీస్తున్నారు. అంతే కాదు ఆయా విభాగాల్లో ఈసీజీ మిషన్లు పనిచేయక పోవడంతో రోగులను, ఇన్‌పేషంట్లను ఇక్కడికే తీసుకురావాల్సి వస్తోంది. దీంతో ఇటు సిబ్బందికి.. అటు రోగులకు

(..మిగతా 8వ పేజీలో)



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఆలకించండి.. పరిష్కరించండి..

- ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు దారుల వినతి
- ఈ-ఆఫీస్‌లో ఫైల్స్ పంపాలని అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ మంత్రుల పర్యటనకు జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, మంత్రుల పర్యటన సమయంలో సంబంధిత కార్యక్రమాలు, శాఖకు సంబంధించిన నోట్స్‌తో రావాలని ఆదేశించారు. ఇక నుంచి జిల్లాలో ఈ- ఆఫీస్ ద్వారా ఆన్‌లైన్ లో ఫైల్ మూమెంట్ జరగాలని కలెక్టర్ సూచించారు. 48 గంటల్లో పరిష్కరించి తిరిగి పంపనున్నట్టు, తన దగ్గర ఫైల్స్ పెండింగ్ ఉండవన్నారు. ఎమర్జెన్సీ సమయంలో తప్ప సాధారణ ఫైల్స్ మొత్తం ఈ-ఆఫీస్ లో ఉండాలన్నారు. ప్రతీ బుధవారం సాయంత్రం 4.00గంటలకు ఏదైనా

(..మిగతా 8వ పేజీలో)



ఖమ్మం జిల్లా అథ్లెట్లకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ ఖమ్మం

- హనుమకొండలో ముగిసిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ పోటీలు

6

ఇన్‌చార్జ్ డీఈవోగా జడ్పీ డిప్యూటీ సీఈవో

ఖమ్మం ఖానాపురంహవేలి, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖ ఇన్‌చార్జ్ అధికారిగా ఖమ్మం జడ్పీ డిప్యూటీ సీఈవో నాగపద్మజను నియమిస్తూ సోమవారం కలెక్టర్ ఉత్తర్వులిచ్చారు. ఈ క్రమంలో ఆమె మంగళవారం లేదంటే బుధవారం బాధ్యతలు స్వీకరిస్తారని సమాచారం. గతంలో డీఈవోగా పనిచేసిన సత్యనారాయణ జూలై 31న ఉద్యోగ విరమణ చేశారు. ప్రస్తుతం ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ జరుగుతున్న క్రమంలో డీఈవోగా ఎవరూ లేకపోవడంతో కొంత ఇబ్బందులు తప్పడంలేదని భావించిన కలెక్టర్ జడ్పీ డిప్యూటీ సీఈవోకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. సోమవారం డీఈవో కార్యాలయంలో ఉద్యోగోన్నతులు ప్రక్రియ తుది దశకు చేరుకుందని, ఆ ఫైల్‌ను ఆర్జేడీ కార్యాలయానికి పంపామని, మంగళవారం పదోన్నతుల ప్రక్రియ పూర్తి వివరాలను ప్రకటిస్తామని ఇన్‌చార్జ్ ఏడీ చావా శ్రీనివాసరావు తెలిపారు.

ఆదివాసీ చరిత్రను.. భావితరాలకు అందించేలా..

- అరుదైన గ్రంథ రచనకు కసరత్తు
- కోయ ఇలవేల్పుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల వివరాల సేకరణ చరిత్రలోనే తొలిసారంటున్న పెద్దలు
- ఐటీడీఏ పీవో ప్రత్యేక కృషితో కార్యరూపం దిశగా..



తలపతుల నుంచి వివరాలు సేకరిస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : వారు పుట్టింది ప్రకృతిలో.. ఆదివాసీ కోయ ఇలవేల్పుల సంస్కృతి సంప్రదాయలను తరతరాలుగా కొనసాగిస్తున్నారు. మాతృభాషను ప్రేమించండం అంటే కన్నతల్లిని ప్రేమించడమే అన్నది వారి భావన. అయితే ఇటీవల కాలంలో గిరిజన యువతకు ఈ సంస్కృతి సంప్రదాయాల వ్యవహారాలు పూర్తిగా తెలియని పరిస్థితి ఉందని గిరిజన పెద్దలు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే భావితరాలకు ఆదివాసీ కోయ ఇలవేల్పుల చరిత్ర సంస్కృతి సంప్రదాయాలు తెలిసేలా అలాగే వాటిని పరిరక్షించే విధంగా చర్యలు చేపట్టాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ నిర్ణయించారు. ఇందులో భాగంగా ఏజెన్సీ ప్రాంతంలో నివసించే ఆదివాసీ, కోయ ఇలవేల్పుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించే ప్రయత్నం ఆరంభమైంది. ఈ ప్రక్రియ జూలై మొదటి వారంలో ప్రారంభం కాగా తొమ్మిది నుంచి 24 వరకు ఆదివాసీ కోయ పెద్దల నుంచి సమ్మక్క సారలమ్మ గిరిజన సంస్కృతి సంప్రదాయాల పురావస్తు పరిశోధన కేంద్రం సంయుక్త సంచాలకులు, టీసీఆర్ఎన్‌టీఐ క్షేత్రస్థాయిలో 105గడ్డలను పర్యటించి స్థానిక తలపతులు, అర్తిబిడ్డలు, గ్రామ పెద్దల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం భద్రాచలం ఐటీడీఏ పీఎంఆర్‌సీలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఏజెన్సీ ప్రాంతాల నుంచి వచ్చిన తలపతులు, గ్రామ పెద్దలు, ఇతరులతో మరింత లోతైన సమాచారాన్ని సేకరిస్తున్నారు.

మొత్తం ఐదు గోత్రాలు

ఆదివాసీ కోయ ఇలవేల్పుల చరిత్రలో ప్రధానంగా ఐదు గోత్రాలకు చెందిన వారున్నారని గుర్తించారు. ఇందులో ఒక్కోగోత్రానికి వివిధ ఇంటిపేర్లతో ఉన్న వారి వివరాలను సైతం వారు సేకరిస్తున్నారు. కాకేటి పూజారి గోత్రం సనపగాని, బండాని, పెరంబోయిన, పారేడుగట్టు గోత్రాలకు చెందిన వారి నుంచి వారి ఇలవేల్పులు, వారి దేవతలు, వారు కొలిచే విధానం, ఇతరత్రా సమాచారాన్ని సేకరిస్తున్నారు. వీరంతా ప్రధానంగా

(.. మిగతా 6వ పేజీలో)

భద్రాద్రిలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ

నిత్య కల్యాణాల నిలిపివేత



తీర్థబిందెను తీసుకొస్తున్న దృశ్యం

భద్రాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సీతారామ చంద్రస్వామి ఆలయంలో సోమవారం పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేశారు. సాయంత్రం పవిత్ర గోదావరి నదీ జలాల నుంచి తీసుకొచ్చిన తీర్థబిందెతో ఈ ఉత్సవాలను ప్రారంభించగా.. ఈ సమయంలో ఆచార్య, బ్రహ్మ, రుత్వికులకు, వేద పారాయణ దారులకు దేవస్థానం అధికారులు దీక్షా వస్త్రాలను అందజేశారు. మంగళవారం అష్టోత్తర శత కలశావాహన

(.. మిగతా 6వ పేజీలో)

భద్రాచలం సబ్ కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన మృణాల్ శ్రేష్ట


సన్మానిస్తున్న ఆర్డీవో దామోదర్‌రావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు

భద్రాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం సబ్ కలెక్టరుగా మృణాల్ శ్రేష్ట సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఆర్డీవో దామోదర్‌రావు నుంచి సబ్ కలెక్టరుగా శ్రేష్ట బాధ్యతలు స్వీకరించారు. అనంతరం భద్రాచలం తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో కార్యాలయం సిబ్బంది సబ్ కలెక్టరును సన్మానించారు. అనంతరం సబ్‌కలెక్టర్ శ్రేష్ట మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో పని చేసిన అనుభవం ఉందని, మండలాల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏ సమస్య అయినా తనవంతుగా పరిష్కరించడానికి కృషి చేస్తానని అన్నారు. గిరిజనుల సమస్యలు త్వరితగతిన పరిష్కరించే విధంగా అందరం కలిసి పని చేద్దామని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. కాగా సబ్ కలెక్టరుగా బాధ్యతలు చేపట్టిన అనంతరం కలెక్టర్ కార్యాలయంకు వెళ్లి జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను మర్యాద పూర్వకంగా కలిసారు.

11న పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

మందుల పంపిణీపై కలెక్టర్ సమీక్ష



సమీక్ష సమావేశానికి హాజరైన జిల్లా అధికారులు, అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : నులి పురుగుల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి, కలెక్టరేట్ సమావేశ మందిరంలో నులి పురుగుల నివారణకు చేపట్టే ఆల్బెండజోల్ మందుల పంపిణీ కార్యక్రమంపై సోమవారం జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ నులి పురుగుల నివారణ దినోత్సవం ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని, 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు నులి పురుగుల నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలు తప్పని సరిగా అందించాలని, లేని పక్షంలో పిల్లల ఎదుగుదలపై ప్రభావం పడుతుందన్నారు. నులి పురుగుల వలన పిల్లల్లో రక్తహీనతతో పాటు ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని, వీటిని నివారిస్తే ఆరోగ్యంగా వుండవచ్చన్నారు. నులి పురుగుల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం, పోలియో తరహాలో ప్రతి ఒక్కరికి చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఆగస్టు 11న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకొని జిల్లాలో 19 సంవత్సరాల వయస్సు లోపు ఉన్న పిల్లలందరికి తప్పనిసరిగా మాత్రలు అందించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఆగస్టు 11న మాత్రలు అందించని విద్యార్థులకు తప్పనిసరిగా ఆగస్టు 18 తేదీన అందించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్య నభ్యసిస్తున్న పిల్లలకు తప్పని సరిగా మాత్రలు అందే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని, పాఠశాలలకు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవ నిర్వహణ, మాత్రల పంపిణీపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. మందుల పంపిణీ కార్యక్రమం కోసం వివిధ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, విద్యాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి జూనియర్ కళాశాలలో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకునే పిల్లలందరికీ ఆగస్టు 11న నులి పురుగుల నివారణ మందులు వేయాలన్నారు.

జిల్లాలోని 1840 అంగన్వాడి కేంద్రాల్లోని 74 వేల 641 పిల్లలకు, 1263 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు, 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 334 ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలోని 19 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణి చేయాలన్నారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్వో ఏ.పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూనే అమలు చేయాలి

వీడియో కాన్ఫరెన్సులో గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ వర్షిని

భద్రాచలం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారమే పౌష్టికహారం అందించాలని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ అలుగు వర్షిని వీడియో కాన్ఫరెన్సు ద్వారా హెచ్‌ఎం, వార్డెన్లను ఆదేశించారు. సోమవారం గిరిజన సంక్షేమ శాఖ కమిషనరేట్ నుంచి ఐటీడీఏ పీవోలు, డీడీ, డీటీడీవోలు, పాఠశాలల హెచ్‌ఎం, వార్డెన్లతో ఆమె వీడియో కాన్ఫరెన్సు ద్వారా మాట్లాడారు. ఖమ్మం జిల్లా కల్లూరులో విద్యార్థులు అల్పాహారం తిని అస్వస్థతకు గురైన కారణాలను అడిగి తెలుసుకున్నారు. గురుకులాల్లో ఫుడ్ కమిటీ సభ్యులుగా పిల్లలను నియమించాలని, నెలకు ఒకసారి ఫుడ్ కమిటీని మార్పులు చేయాలని అన్నారు. పిల్లలకు వడ్డించే ఆహారాన్ని సంబంధిత హెచ్‌ఎం, వార్డెన్, ఉపాధ్యాయులు టేస్ట్‌చేసి ఫుడ్ మంచిగా ఉందని ధృవీకరించిన 15నిమిషాల తరువాతే పిల్లలకు వడ్డించాలన్నారు. మెస్ కమిటీ సభ్యులు వార్డెన్ ఇచ్చిన సామాన్లను ఖచ్చితంగా తనిఖీ చేయాలని, మూడు రోజులకు ఒకసారి స్టోర్ రూములోని సామాన్లను తనిఖీ చేయాలని, జీసీసీ వారు సరఫరా చేసే సామాన్లు గడువుతేదీ ముగిసిపోతే వెంటనే తీసివేయాలని అన్నారు. కూరగాయలను పరిశుభ్రంగా ఉంచాలని, కొత్త మెనూ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో బి.రాహుల్, డీడీ మణెమ్మ, ఆర్‌సీవో గురుకులం అరుణకుమారి, ఏటీడీవోలు అశోక్‌కుమార్, చంద్రమోహన్, రాధమ్మ పాల్గొన్నారు.

10న ఉమ్మడి ఖమ్మం జిల్లా టేబుల్ టెన్నిస్ ఎంపికలు

అధ్యక్షుడు బాలసాని విజయ్

ఖమ్మంస్పోర్ట్స్/చుంచుపల్లి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలను ఈనెల 10వ తేదీన ఖమ్మం సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా టేబుల్ టెన్నిస్ అధ్యక్షుడు బాలసాని విజయ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఎంపికలో 11 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల బాలబాలికలు ఓపెన్ విభాగంలో మహిళా, పురుష జట్లను ఎంపిక చేయనున్నట్లు ఉమ్మడి అసోసియేషన్ బాధ్యులు ఓలేటి సాంబమూర్తి, బట్టు ప్రేమ్‌కుమార్‌లు తెలిపారు. ఇక్కడ ఎంపికైన జట్లు త్వరలో ఖమ్మంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీల్లో జిల్లా జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈనెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు జనన ధ్రువీకరణ పత్రం, ఒక పాస్‌పోర్టు సైజు ఫోటోతో సర్దార్ పటేల్ స్టేడియంలో రిపోర్ట్ చేయవలసిందిగా తెలిపారు. పూర్తి వివరాలకు 9848408335లో సంప్రదించాలని పేర్కొన్నారు.

సరోగసి పేరుతో మోసం చేస్తున్న ఫెర్టిలిటీ సెంటర్లు

తక్షణం చర్యలు తీసుకోవాలని పీవోడబ్ల్యూ నిరసన

డీఎంహెచ్‌వోకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వినతి


జిల్లా వైద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిరోమణి

ఖమ్మం సంక్షేమ విభాగం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ప్రజల్ని మోసం చేస్తున్న ఫెర్టిలిటీ సెంటర్లను గుర్తించి నిబంధనలు పాటించని వాటిని వెంటనే రద్దు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి కోరారు. ఇటువంటి సెంటర్లు పేరు మార్చి కొత్త బోర్డులు పెట్టి కొత్తగా పుట్టుకురాకుండా ఇందుకు సంబంధించిన డాక్టర్లపై ఐఎంఏను వివరణ కోరాలని డిమాండ్ చేశారు. సరోగసి పేరుతో పిల్లలు లేని దంపతులను దోచుకుంటున్నారని ఆరోపిస్తూ సోమవారం ఖమ్మం కలెక్టర్ కార్యాలయం ఎదుట పీవోడబ్ల్యూ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం జిల్లా వైద్యాధికారి కళావతిబాయికి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మంలో ఫెర్టిలిటీ సెంటర్లు ఏర్పాటు చేశారని, దేశంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మంలోని ఫెర్టిలిటీ సెంటర్లో పిల్లల సక్సెస్ రేటు నమోదు ఏలా జరుగుతుందని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షురాలు గోకినేపల్లి లలిత, సహాయ కార్యదర్శి ప్రతాపనేని శోభ, నాయకులు తుడుం ఝాన్సీ, ఇమ్మిడి చైతన్య, పరిమళ వెంకటనర్సమ్మ, వెంకట్‌లక్ష్మి, ఉమా, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం నుంచే రాజకీయ మార్పుకు పునాది

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనపై ప్రజల్లో విరక్తి

విలేకరుల సమావేశంలో బీజేపీ స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జ్ మాజీమంత్రి ఇనగాల పెద్దిరెడ్డి


మాట్లాడుతున్న మాజీమంత్రి ఇనగాల పెద్దిరెడ్డి

ఖమ్మంబైపాస్ రోడ్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాజకీయ సమీకరణాల్లో ఇప్పుడు ఖమ్మంనుండి రాజకీయ మార్పుకు పునాది కాబోతుందని బీజేపీ రాష్ట్ర నాయకుడు స్థానిక సంస్థల ఎన్నికల ఖమ్మంజిల్లా ఇన్‌చార్జి ఇనగాల పెద్దిరెడ్డి తెలిపారు. నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో సోమారం నిర్వహించిన మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మంజిల్లా గతంలో ఎన్టీఆర్‌కు రాజకీయ బలం ఇచ్చిందని, ఇదే ప్రజలు ఇప్పుడు ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీకి శక్తిని ప్రసాదించబోతున్నారన్నారు. జిల్లాలో రాజకీయ వాతావరణం మారుతుదని, ప్రజలంతా మార్పు వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. ఒకవైపు బీర్ఎస్ కుటుంబ కలహాలతో అలజడి మొదలయిందని, మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వంలో శూన్యతే మిగిలిందన్నారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతిబూత్‌లో మహా సంపర్క్ అభియాన్ సమావేశాలు నిర్వహించనున్నామని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతుందన్నారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో అత్యధిక విజయం సాధించడమే లక్ష్యం అని రాష్ట్రంలో ముగ్గురు మంత్రులు ఖమ్మం జిల్లాకు ఉన్నా అభివృద్ధి నిధులు రావడం లేదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు దేవకి వాసుదేవరావు, ఈవీ రమేష్, దొంగల సత్యనారాయణ, రవి కుమార్, పుల్లారావుయాదవ్, నంబూరి రామలింగేశ్వరరావు, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, జాలా నర్సింహారావు, ధనియాకుల వెంకటనారాయణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక'మే లక్ష్యంగా..

(5వ పేజీ తరువాయి)

రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్‌లో చేరిన ఆయన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థచైర్మన్‌గా పనిచేశారు. గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌లో ఉన్న కొండబాల ఎన్నికల్లో బీఆర్ఎస్ పరాజయం అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టితో చర్చలు జరిపి కాంగ్రెస్ గూటికి చేరారు. జిల్లాలో ముదిగొండ మండలంలో కూడా జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో ముదిగొండ మండలంలోని 25కుటుంబాలు వేరే పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. ఈ క్రమంలో విపక్షాలు ముఖ్యంగా బీఆర్ఎస్ శ్రేణుల్లో అంతర్మథనం మొదలైంది.

పార్టీ కోసం పనిచేసే వారికే ఆహ్వానం..

చేరికల విషయంలో కాంగ్రెస్ అధిష్టానం కొత్త వైఖరిని అవలంబిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్, సీపీఎం, సీపీఐ, బీజేపీ తదితర పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించాలని ఎమ్మెల్యేలు, మంత్రులకు సూచిస్తోంది. కానీ పార్టీలోకి రావాలనుకునే వరికి ప్రస్తుతానికి పదవుల విషయంపై ఎలాంటి హామీ ఇవ్వవద్దని.. తొలుత పార్టీకోసం పనిచేసే వారిని మాత్రమే ఆహ్వానించాలని ఆదేశాలిస్తోంది. దీంతో పాటు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవం చేర్చుకునేందుకు విపక్షాల నుంచి ఇబ్బందులు లేకుండా వారినే పార్టీలోకి ఆహ్వానించడం, స్థానికంగా సర్దుబాటు చేసుకుని పదవులు పంచుకోవడం లాంటి ఒప్పందాలకు సిద్ధమవుతున్నారు. దీంతో చాలా గ్రామాల్లో విపక్ష బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు అధికార కాంగ్రెస్ నేతలు అభివృద్ధి పనులు ఇస్తామని, పార్టీలో ప్రాధాన్యమిస్తామని తమ ప్రత్యర్థులకు గాలం వేస్తున్నారు. తద్వారా విపక్షాలు బలహీనపడి స్థానిక ఎన్నికలకు పోటీలేకుండా ఏకగ్రీవం సాధ్యమవుతుందని అధికార నేతలు ఆశిస్తున్నారు. దీంతో జిల్లాలో పలు నియోజకవర్గాల్లో రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌లోకి చేరికలు మరింత ఊపందుకోనున్నాయి.

సౌత్ ఇండియా కుంగ్ ఫూ కరాటే పోటీల్లో భద్రాద్రి జిల్లాకు ఐదు పతకాలు

చుంచుపల్లి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): సౌత్ ఇండియా కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో భద్రాద్రిజిల్లాకు చెందిన క్రీడాకారులు ఐదు పథకాలు సాధించారని కరాటే మాస్టర్ కరాటే పి.కాశీహుస్సేన్ సోమవారం తెలియజేశారు. ఖమ్మంలో ముగిసిన సౌత్ ఇండియా కుంగ్ ఫూ- కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో భద్రాద్రి క్రీడాకారులు పలు విభాగాల్లో సత్తాచాటి పతకాలు గెలుపొందారు. బాలుర విభాగంలో అండర్-17 కటాస్ విభాగంలో కె.లిఖిత్‌చరణ్ బంగారు పతకం, అండర్-10 బి.భానుకృష్ణ కటాస్ విభాగంలో వెండి పతకం గెలుపొందారు. అదేవిధంగా బాలికల విభాగంలో అండర్-8లో ఎస్.షణ్ముఖశ్రీ, అండర్-10లో సీహెచ్ సాత్విక, అండర్-12లో వి.శరణ్య కటాస్ విభాగంలో కాంస్యపతకాలు గెలుపొందారు. మార్షల్ ఆర్ట్ శిక్షకురాలు పెదపాటి నిహారిక ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వీరు పతకాలు గెలుపొందడంతో జిల్లాలోని వివిధ క్రీడా అసోసియేషన్ సభ్యులు, సీనియర్ క్రీడాకారులు శుభాకాంక్షలు తెలిపారు.

వైరా రిజర్వాయర్‌ను.. ఈసీవో టూరిజం హబ్‌గా మార్చాలి

మంత్రులు సురేఖ, సీతక్కకు ఎమ్మెల్యే రాందాస్ ప్రతిపాదనలు


వైల్డ్‌లైఫ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు

వైరా, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్‌ను ఈసీవో టూరిజం హబ్‌గా మార్చాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ కోరారు. సోమవారం తెలంగాణ అంబేద్కర్ సచివాలయ భవన్‌లో అటవీశాఖ మంత్రి, వైల్డ్‌లైఫ్ చైర్‌పర్సన్ కొండా సురేఖ ఆధ్వర్యంలో జరిగిన వైల్డ్‌లైఫ్ మీటింగ్‌లో మెంబర్ అయిన ఎమ్మెల్యే రాందాస్ పాల్గొని ప్రసంగించారు. వైరా రిజర్వాయర్‌ను ఈసీవోగా టూరిజం హబ్‌గా మార్చేందుకు అన్ని వరులున్నాయని, ఈసీవో బృందాన్ని వైరా రిజర్వాయర్ వద్దకు పంపించిన అధ్యయనం చేయాలని, తద్వారా టూరిజం హబ్‌గా మార్చాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. దీనికి మంత్రులు కొండా సురేఖ, సీతక్క సానుకూలంగా స్పందించారు. వెంటనే వైరా రిజర్వాయర్‌ను సందర్శించాలని అధికారులను ఆదేశించారు. రిజర్వాయర్‌ను పరిశీలించి టూరిజం హబ్‌గా మార్చాలని సూచించారు. మంత్రులిద్దరికీ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు.

సుజాతనగర్ ఎస్సై రమాదేవికి కాంస్యం

- 2వ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌కు భద్రాద్రి జోన్ నుంచి ఎంపిక
- అభినందించిన డీజీపీ జితేందర్


ఎస్ఐ రమాదేవిని అభినందిస్తున్న డీజీపీ జితేందర్

సుజాతనగర్, ఆగస్టు (ఆంధ్రజ్యోతి): సుజాతనగర్ ఎస్ఐ రమాదేవి 2వ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో కాంస్య పతకం సాధించింది. గత నెల 31 నుంచి ఆగస్టు 2 వరకు వరంగల్‌లోని మామునూరు పోలీస్ ట్రైనింగ్ కాలేజీలో జరిగిన 2వ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో భద్రాద్రి జోన్ నుంచి సుజాతనగర్ ఎస్ఐ ఎంపిక అయ్యారు. అక్కడ జరిగిన సైంటిఫిక్ ఎవిడెన్స్ టు ఇన్విస్టిగేషన్ విభాగంలో మెడికో లీగల్ ఓరల్ టెస్ట్‌లో బ్రాంజ్ మెడల్ సాధించారు. అదే విధంగా సైంటిఫిక్ ఎయిడ్స్ టు ఇన్విస్టిగేషన్ విభాగంలో పాల్గొన్న అన్ని పోలీస్ జోన్స్‌లో సుజాతనగర్ ఎస్ఐ టీం భద్రాద్రి జోన్ మూడో స్థానంలో నిలిచింది. డీజీపీ రమాదేవిని, ఆమె టీంని అభినందించారు. దీనితో మండలంలో పలువురు అభినందనలు తెలిపారు.

చైల్డ్ ఫోర్న్ వీడియోలు చూసిన ఇద్దరిపై కేసు

పాల్వంచ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లో చైల్డ్ ఫోర్న్ వీడియోలను చూసిన ఇద్దరిపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ టౌన్ పోలీసులు సోమవారం కేసులు నమోదు చేశారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచకు చెందిన ఇద్దరు వ్యక్తులు తరచూ ఆన్‌లైన్‌లో చైల్డ్‌ఫోర్న్ వీడియోలను చూస్తుండటాన్ని.. పసిగట్టిన కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఓ సంస్థ.. తమ పరిధిలోని యాప్‌ను వినియోగించి సదరు వ్యక్తులు తరచూ చైల్డ్‌పోర్న్ వీడియోలు చూస్తున్నారని నిర్ధారణకొచ్చింది. చట్ట ప్రకారం చైల్డ్ ఫోర్న్ వీడియోలు చూడటం నేరం కావడంతో.. సదరు సంస్థ వారు విషయాన్ని పాల్వంచ టౌన్ పోలీసులకు సిఫారసు చేశారు. దీంతో అప్రమత్తమైన పాల్వంచ పోలీసులు సోమవారం పట్టణానికి చెందిన ఆ ఇద్దరిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేశారు.

అథ్లెటిక్స్ ఓవరాల్ చాంపియన్ ఖమ్మం

హనుమకొండలో ముగిసిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ జహహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్) సింథటిక్‌ట్రాక్‌పై నిర్వహించిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఖమ్మం జిల్లా క్రీడాకారులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను సాధించారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జేఎన్ఎస్‌లో నిర్వహిస్తున్న 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్, సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం ముగిశాయి. 33 జిల్లాల, 10 స్పోర్ట్స్ పాఠశాలల నుంచి 1400 మంది రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. హోరాహోరీగా జరిగిన త్రోస్, జంప్స్, రన్స్‌తో పాటు టీం ఈవెంట్లలో ఖమ్మంజిల్లా అథ్లెట్లు ముందు నుంచే దూకుడుగా తమ ప్రతిభతో మెరిసి పలు పసిడి, రజత, కాంస్య పతకాలు కొల్లగొట్టి ఓవరాల్ చాంపియన్‌షిప్‌తో పాటు అండర్- 20 బాలబాలికల టీం చాంపియన్‌షిప్ సాధించారు. అండర్-18 బాలుర విభాగం టీం చాంపియన్‌షిప్‌లో మహబూబ్‌నగర్, బాలికల్లో ఖమ్మం, అండర్-16 బాలురు విభాగంలో రంగారెడ్డి, బాలికల విభాగంలో ఆతిధ్య హనుమకొండ జిల్లా అథ్లెట్లు తమ ప్రతిభతో రాణించారు. జేఎన్ఎస్‌లో జరిగిన ముగింపు సమావేశానికి ఆర్య వైశ్య సంఘం జాతీయ కార్యవర్గసభ్యుడు గట్టు మహేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటమిని రేపటి గెలుపు కోసం మలుచుకోవాలని క్రీడాకారులకు సూచించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, డీవైఎస్‌వో అశోక్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పగడాల వెంకటేశ్వర్‌రెడ్డి, అంతర్జాతీయస్థాయి అథ్లెట్, మడికొండ పోలీస్‌స్టేషన్ సీఐ పుల్యాల కిషన్, కోచ్‌లు శ్రీమన్నారాయణ, దిమ్మిక నాగరాజు, పీడీలు మనోజ్‌కుమార్, వాసు, రజినికాంత్, వివిధ జిల్లాలకు చెందిన అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లా క్రీడాకారులకు 26 పతకాలు


చుంచుపల్లి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ ఛాంపియన్ షిప్-2025లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన క్రీడాకారులు 26 పతకాలు గెలుపొందారు. రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ముగిసిన ఈ పోటీల్లో భద్రాద్రి అథ్లెట్లు 40మంది పాల్గొన్నారు. వీరిలో 6 బంగారు పతకాలు, 14 రజతాలు, 6 కాంస్య పతకాలు దక్కాయి. పతకాలు సాధించిన క్రీడాకారులను సోమవారం జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహిధర్, రాష్ట్ర అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కె.సారంగపాణి తదితరులు అభినందించారు.

'ఎర్త్‌సైన్స్'లో ఈ ఏడాది రెండు కోర్సులే..

జియాలజి, ఎన్విరాల్‌మెంటల్ సైన్స్‌లో అడ్మిషన్లు

తరగతుల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్న యంత్రాంగం

యుద్ధప్రాతిపదికన క్లీన్ అండ్ గ్రీన్‌కార్యక్రమాలు


యూనివర్సిటీ ఆవరణను శుభ్రం చేస్తున్న సిబ్బంది

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీలో 2025-26 విద్యా సంవత్సరం నుంచి కోర్సులు ప్రారంభించాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ ఏడాది నుంచే తప్పనిసరిగా తరగతులు నిర్వహించాలని ఆదేశించడంతో అందుకుగాను యంత్రాంగం పట్టుదలతో ఏర్పాట్లు చేస్తోంది. దీనిలో భాగంగా ఈ ఏడాది రెండు కోర్సులను మాత్రమే ప్రారంభించనున్నారు. బీఎస్సీ జియాలజీ, బీఎస్సీ ఎన్విరాన్‌మెంటల్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సులు ప్రారంభమవుతాయని ప్రిన్సిపాల్ టి.జగన్‌మోహన్ రాజు తెలిపారు. విద్యార్థులు, సౌకర్యాలు, అధ్యాపకులు, సిబ్బందిని దృష్టిలో ఉంచుకుని ఈ రెండు కోర్సులు మాత్రమే ప్రారంభిస్తున్నామని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఇంజనీరింగ్ కళాశాలలో 800మంది విద్యార్థులు ఉండగా కొత్తగా వచ్చే విద్యార్థుల కోసం తరగతి గదులు, ప్రయోగశాలలు, హాస్టళ్ల కోసం పాత క్యాంపస్‌లో తాత్కాలిక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదిలా ఉంటే క్యాంపస్‌లో గత రెండు రోజులుగా యుద్ధప్రాతిపదికన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కొత్తగూడెం పరిధిలోని పలు పంచాయతీలు, మున్సిపాలిటీ పరిధిలోని వర్కర్స్ సాయంతో ఈ పనులు చేపట్టారు.

ఖమ్మంజిల్లా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఇదే

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆస్పత్రి అభివృద్ధి కమిటీని ఇటీవల నియమించారు. గతంలో వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఆస్పత్రి సమావేశాలు నిర్వహించారు. రెండున్నరేళ్ల క్రితం వైద్యవిధాన పరిషత్ నుంచి డీఎంఈగా మారింది. మెడికల్ కళాశాలకు అనుసంధానంగా బోధన ఆస్పత్రిగా మార్చారు. ఈ నేపథ్యంలో ఏడాదిన్నర నుంచి ఆస్పత్రి అభివృద్ధి కమిటీ లేదు. తొలిసమావేశాన్ని ఈనెల 8న నిర్వహించనున్నారు. ఇటీవలే కమిటీని నియమించారు.

కమిటీ సభ్యులు వీరే

చైర్మన్‌గా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, వైస్ చైర్మన్‌గా మెడికల్ కళాశాల డైరెక్టర్ ఎ.నరేందర్‌కుమార్ ఉన్నారు. మెంబర్లుగా సీనియర్ డాక్టర్ బి.కిరణ్‌కుమార్,ఆర్ఎంవో బి.రాంబాబు, సీనియర్ ప్రొఫెసర్ రవి(అనస్తీషియా), యామిని (గైనకాలజిస్ట్), సరిత(పీడియాట్రీషియన్), మునిసిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అల్యూమినీ అసోసియేషన్ రిప్రజెంటేటివ్ ఆకాంక్ష, వీజీ హౌస్‌సర్జన్ చైతన్య, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ రావు, రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రటీ వి.చంద్రమోహన్, రోటరీ, లయన్స్ క్లబ్ రిప్రజేంటేషన్ డి.మాధవ రెడ్డి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుహాసిని, డీఎంహెచ్‌వో బి.కళావతిబాయి, డీసీహెచ్ఎస్ ఎ రాజశేఖర్‌గౌడ్, ఎస్.సంధ్య, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శంకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఉమామహేశ్వర్‌రావు (టీఎస్ఎంఎస్ఐడీసీ) మొత్తం 17 మందితో నూతన కమిటీని నియమించారు.

8న అభివృద్ధి కమిటీ సమావేశం

జిల్లాఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఈనెల8న నిర్వహించనున్నారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించే ఈసమావేశంలో అభివృద్ధి పనులు, ఇతర కార్యక్రమాలపై చర్చించనున్నారు. గత సమావేశంలో నిర్వహించిన అంశాలు, చర్చించిన విషయాలు, అధికారులు తీసుకున్న చర్యలపై చర్చించనున్నారు. ఈ సమావేశానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హాజరుకానున్నారు. 27మంది కమిటీసభ్యులు ఉంటారు. మెడికల్ కళాశాల ఏర్పాటై ఏడాదిన్నర నుంచి ఇప్పటి వరకు కమిటీ ఏర్పాటు కాలేదు. ఇటీవల కమిటీని ఏర్పాటు చేశారు. తొలి సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నారు.

'కల్లూరు ఆశ్రమం'లో కలకలం

(5వ పేజీ తరువాయి)

అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. వైద్యురాలు అయిన ఎమ్మెల్యే రాగమయి స్టెతస్కోప్‌తో స్వయంగా బాలికలను పరీక్షించారు. అనంతరం గిరిజన ఆశ్రమ పాఠశాలలోని వసతి గృహపరిసరాలను పరిశీలించి.. ఆహారం వండిన వారు, సంబంధిత సంక్షేమ అధికారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు వసతి గృహ అధికాపై తగిన చర్యలు తీసుకోవాలని ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

భద్రాద్రిలో పవిత్రోత్సవాలకు అంకురార్పణ

(5వ పేజీ తరువాయి)

అగ్ని ప్రతిష్ఠాపన, సాయంత్రం పవిత్రాధివాసం నిర్వహించనున్నారు. బుధవారం నిత్యకల్యాణ మండపంలో శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి అష్టోత్తర శత కలశాభిషేకం జరపనున్నారు. మధ్యాహ్నం 2 గంటకు పవిత్రారోపణ గావించనున్నారు. గురు, శుక్ర వారాల్లో నిత్య హోమాలు, వేద పారాయణం, శనివారం పూర్ణాహుతి, పవిత్రాల ఉద్వాసన, మహా కుంభ ప్రోక్షణ నిర్వహించనున్నారు. ఇదిలా ఉండగా పవిత్రోత్సవాల సందర్భంగా మంగళవారం నుంచి శనివారం వరకు నిత్య కల్యాణాలు, పవళింపు సేవలను నిలిపేయనున్నారు.

భావితరాలకు అందించేలా..

(5వ పేజీ తరువాయి)

పూర్వ మధ్యప్రదేశ్(నేటి ఛత్తీస్‌గఢ్), పూర్వ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రల్లో ఉన్నట్లు గుర్తించారు.

చరిత్రలోనే తొలిసారంటున్న ఆదివాసీ పెద్దలు

గతంలో ఆదివాసీ కోయ చరిత్రలపై అనేక పుస్తకాలు, కథనాలు వచ్చాయి. అయితే ఆదివాసీ కోయ ఇలవేల్పుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకొని వాటిని గ్రంథం రూపంలో తెచ్చే ప్రయత్నం జరగడం చరిత్రలో ఇదే తొలిసారి అని ఆదివాసీ పెద్దలు స్పష్టం చేస్తున్నారు. భావి తరాలకు ఇలవేల్పుల చరిత్ర సంస్కృతి, సంప్రదాయాన్ని అందించడమే లక్ష్యంగా చేస్తున్న ఈ ప్రయత్నం ఫలించే దిశగా సాగుతోందని వారు పేర్కొంటున్నారు. ఇందు కోసమే తాము క్షేత్రస్థాయిలో ఇలవేల్పుల స్థానం ఉండే ఆ ప్రాంతాలకే వెళ్లి వివరాలు సేకరించినట్టు పేర్కొంటున్నారు. వేల్పుల, చరిత్ర విషయాలు వాస్తవికతకు దగ్గరగా వస్తున్నట్లు వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదే సమయంలో సేకరించిన సమాచారంతో పాటు తమ వద్ద ఉన్న సమాచారాన్ని క్రోడీకరించి గ్రంథ రచన పూర్తి చేయనున్నట్టు వారు వెల్లడిస్తున్నారు.

ఐటీడీఏ పీవో ప్రత్యేక కృషితో కార్యరూపం దిశగా

ఆదివాసీ కోయ ఇలవేల్పుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాల గ్రంథం కార్యరూపం దాల్చే దిశగా కొనసాగుతుండటానికి ప్రధాన కారణం భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్. ఇందుకు కారణం పీవోగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి ఆదివాసీ కోయ భాషపై ప్రేమను వ్యక్తం చేయడమే కాకుండా వారి భాషలో మాట్లాడటం ఆహ్వాన పత్రికలు ప్రశంసా పత్రాలు కోయభాషలోనే జరుగుతోంది. ఈ క్రమంలో 2025 ఫిబ్రవరి నెలలో కరకగూడెం మండలం చిరుమల్ల జాతరను తిలకించేందుకు వెళ్లిన సమయంలో కోయ జాతి ఇలవేల్పుల సంస్కృతి సంప్రదాయాలను స్వయంగా తిలకించారు. దీంతో పీవో రాహుల్ దీనిపై మరింత నిశితంగా సమాచారాన్ని తెలుసుకొని ఇలవేల్పుల చరిత్రను గ్రంథం రూపంలో తేవాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే సమ్మక్క సారలమ్మ గిరిజన సంస్కృతి సంప్రదాయాల పురావస్తు పరిశోధన కేంద్రం సంయుక్త సంచాలకులు బుగ్గా కోటేశ్వరరావు, తలపతుల జాతీయ సంఘంలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఇర్పా జగపతి, కోయ సంస్కృతిపై పట్టున్న విశ్రాంత ప్రధానోపాధ్యాయులు తెల్లం రమణయ్య, గిరిజన మ్యూజియం నిర్వాహకులు కోంద్రు వీరస్వామి, ఇలవేల్పుల అర్తిబిడ్డలు సకినం శ్రీనివాసరావు, తోకల గోపాలరావు, నక్కా సూరిబాబు గ్రంథ రచనలో తమవంతు పాత్రను పోషిస్తున్నారు.

రోడ్డు ప్రమాదాలను అరికట్టేలా చర్యలు చేపట్టాలి: సీపీ



మొబైల్ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు అరికట్టే దిశగా మరింత పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని పోలీసుకమిషనర్ సునీల్‌దత్ సూచించారు. సోమవారం సీపీ కార్యాలయం నుంచి జిల్లాలోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరసమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీపీ మాట్లాడుతూ జిల్లాలో వైరా, కల్లూరు డివిజన్‌పరిధిలో గుర్తించిన బ్లాక్‌స్పాట్లలో బారికేడింగ్, ప్రమాదసాంకేతిక సూచిక బోర్డులు, స్టాపర్స్, సింగల్‌లైట్స్, బ్లింకింగ్ లైట్స్ ఏర్పాటుచేసి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో గంజాయి సరఫరా, వినియోగాన్ని సమూలంగా నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈసమావేశంలో సీపీఆర్బీ సీఐ స్వామి, ఎస్ రవి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరి మొబైల్ వ్యాన్ ప్రారంభం

ఖమ్మంక్రైం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): నేర పరిశోధనలో కీలకంగా ఉపయోగపడే ఫోరెన్సిక్ సైన్సు ల్యాబోరేటరి మొబైల్‌ల్యాబ్ వ్యాన్‌ను సోమవారం పోలీసుకమిషనర్ సునీల్‌దత్ ప్రారంభించారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి తక్షణమే పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా ఈ వాహనం పూర్తిసదుపాయాలతో కూడిన మొబైల్ ల్యాబ్‌గా పనిచేస్తుందని సీపీ తెలిపారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి, ఆయా ప్రదేశాలలో లభించిన అన్నిరకాల సాక్ష్యాలను సేకరించి, ప్రాథమిక విశ్లేషణలు చేసే ఈవాహనం నేర పరిశోధనలో చాలా ముఖ్యమైందన్నారు. ఈకార్యక్రమంలో ఏఆర్ఏసీపీ సుశీల్‌సింగ్, ఆర్ఐ కామరాజు, శ్రీశైలం, సురేష్, నాగుల్‌మీరా, శాస్త్రీయ అధికారులు డాక్టర్ వి.నాగలక్ష్మి, కె.సుధాకర్, కె.నరసింహ పాల్గొన్నారు.

ఐసీఎంఆర్ సెంట్రల్ విద్యార్థులకు శిక్షణ



ఐసీఎంఆర్ సెంట్రల్ విద్యార్థులతో అధికారులు

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి అధ్యయనం కోసం ఐసీఎంఆర్ (ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ సెంట్రల్ టీం సర్వేయర్లు (విద్యార్థులు)సోమవారం జిల్లాకు చేరుకున్నారు. ఈ బృందం సభ్యులు జిల్లాలో 60 రోజుల పాటు సర్వే నిర్వహిస్తారు. తొలుత జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. వారికి ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామారావు, డీఎంవో డాక్టర్. వెంకటరమణ సమావేశం అయ్యారు. తొలిరోజు స్ఫూర్తి కాన్ఫరెన్స్ హాలులో కమ్యూనిటీ సర్వేలో విద్యార్థులు ఎన్సీడీ. (నాన్ కమ్యూనికేబుల్ డిసీసెస్) లో హైపర్ టెన్షన్(హెచ్‌టీఎన్) మధుమేహం (డీఎం) వ్యాధులకు సంబంధించి రాష్ట్రస్థాయి శిక్షకులు డాక్టర్ స్వాతి, ప్రాజెక్ట్ సైంటిస్ట్,గగ్రా ప్రాజెక్ట్ శాస్త్రవేత్త డాక్టర్ రోహిత్ సర్వేయర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ క్వాలిటీ సూపర్‌వైజర్ మాలతి పాల్గొన్నారు.

అరుణోదయం.. అపురూపం



చుట్టూ పచ్చని పొలాలు.. నీటి గలలతో.. ప్రకృతి అందాల పొదరిల్లులా ఉండే వైరా రిజర్వాయర్ ప్రాంతం సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో ఆహ్లాదాన్ని పంచుతుంది. ఇదిగో ఇలా నిత్యం అపురూప దృశ్యాలతో కనువిందు చేస్తుంది. సోమవారం అరుణోదయ సమయాన నీలి ఆకాశాన్ని చీల్చుకుంటూ వస్తున్న అరుణ కిరణాలతో ఆకాశం పసిడి వర్ణాన్ని పులుముకుంది.

- వైరా, ఆంధ్రజ్యోతి

ఇక్కడింతే.. పట్టించుకోరంతే..

- ఖమ్మం జిల్లా ఆస్పత్రిలో కానరాని స్ట్రెచర్లు, వీల్‌చైర్లు
- ఏ విభాగానికైనా కుటుంబీకులు తీసుకెళ్లాల్సిందే..



రోగి సంబంధీకులే ఆస్పత్రిలోకి తీసుకెళ్తున్న దృశ్యం

ఖమ్మం కలెక్టరేట్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఖమ్మం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి చికిత్స కోసం పెద్దసంఖ్యలో గ్రామీణ ప్రాంతాల నుంచి రోగులు వస్తుంటారు. ఆస్పత్రికి అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులకు ఓపీ విభాగానికి వెళ్లాలన్నా.. ఎక్స్‌రే... వార్డులోకి వెళ్లాలన్నా.. ల్యాబుల్లో టెస్ట్‌లకు వెళ్లాలన్నా అక్కడ సహాయకులు ఉండరు.. కనీసం స్ట్రెచర్.. మూడు చక్రాల కుర్చీలు కూడా ఉండవు.. నడవలేని రోగుల కష్టాలు కూడా ఇక్కడ ఎవ్వరికీ పట్టవు. సోమవారం నగరానికి చెందిన మేరీ అనే 85 ఏళ్ల వృద్ధురాలికి 20 రోజుల క్రితం చెయ్యి విరిగింది. జిల్లా ఆస్పత్రిలోనే కట్టు వేశారు. నడవలేని స్థితిలో 21రోజుల తర్వాత కట్టు విప్పించుకునేందుకు వచ్చింది.. ఇదిగో ఇలా అష్టకష్టాలు పడుతున్న ఆమెను కుటుంబీకులే లోపలికి తీసుకెళ్తూ కనిపించారు.

51 డ్రంకెన్ డ్రైవ్ కేసుల నమోదు

ఖమ్మంక్రైం, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రంకెన్ డ్రైవ్‌పై కొద్దిరోజులుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 51కేసులు నమోదు చేసినట్టు ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనాలు నడిపేవారు తప్పకుండా వాహనాలు నడపాలని మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు.



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

నాణ్యమైన విద్యా ప్రమాణాలు పాటించాలి

భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

కరకగూడెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వెనుక బడిన ప్రాంతాల బాలికలకు సమగ్ర విద్యను అందించడంలో కస్తూర్బా విద్యాలయాలు నాణ్యమైన వసతులు, భద్రతా ప్రమాణాలు, ఆరోగ్యకరమైన ఆహారం కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందని భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. సోమవారం మండలంలోని భట్టుపల్లిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా టీచర్‌గా మారి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, విద్య బోధన, భోజనం తదితర అంశాల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి చదువులో ఉన్నత స్థాయికి చేరేందుకు అవసరమైన పరిసర వాతావరణం పాఠశాలలో ఉండాలన్నారు. మౌలిక వసతుల కల్పనలో రాజీ ఉండరాదన్నారు. అనంతరం పాఠశాలలో తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, వంటగది, మరుగుదొడ్లు పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మునగ, కరివేపాకు, ఉసిరి మొక్కలను పెంచాలని సూచించారు. విద్యార్థులకు ఔషధ మొక్కలపై అవగాహన కల్పించాలని తెలిపారు. అనంతరం కరకగూడెం జిల్లా పరిషత్ పాఠశాల వద్ద తాత్కలికంగా ఏర్పాటు చేయనున్న నవోదయ పాఠశాల పనులను పరిశీలించారు. త్వరతగతిన పాఠశాలను ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో గడ్డం మంజుల, తహసీల్దార్ గంట ప్రతాప్, ఎంపీడీవో కుమార్, ఎంపీవో మారుతి, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, ఎస్వో శ్రీదేవి అధికారులు పాల్గొన్నారు.

45 కేజీల గంజాయి పట్టివేత

ఇల్లెందు టౌన్ ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు కొత్తగూడెం ప్రధాన రహదారి మార్గంలోని బొజ్జాయిగూడెం వద్ద సోమవారం 45.256కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. డీఎస్పీ చంద్రభాను తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి బొజ్జాయిగూడెం పంచాయతీ కార్యాలయం సమీపంలో వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా కొత్తగూడెం వైపు నుంచి ఇల్లెందుకు వస్తున్న కారును ఆపి తనిఖీలు చేశారు. కారులో గంజాయిని గుర్తించారు. కారులో ఉన్న తేజావత్ శంకర్, తేజావత్ జంకు, రామును అరెస్టు చేశారు. వీరు ఒడిషా నుంచి గంజాయిని మహారాష్ట్రకు తరలిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. గంజాయి విలువ రూ.22,62,800 ఉంటుందని తెలిపారు. పట్టుబడిన వారి నుంచి 3 సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

కరకగూడెం, చింతకాని మండలాల్లో ఘటనలు



నరేందర్(ఫైల్)

కరకగూడెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో లక్ష్మీపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భట్టుపల్లి పంచాయతీ లక్ష్మీపురం గ్రామానికి చెందిన బిలపాటి నరేందర్ (20) తమ పొలానికి నీరు పారించేందుకు ఓ రైతుకు చెందిన బోరు మోటార్ అడిగాడు. మోటార్ నీరు పారించేందుకు మోటార్ వద్ద విద్యుత్ తీగను పక్కన ఉన్న పెన్సింగ్ కంచేకు తగిలించాడు. నీరుపారించే ట్యూబ్‌ను కట్టి మోటార్ వేసేందుకు వస్తున్న క్రమంలో అప్పటికే పెన్సింగ్ ఇనుప తీగకు విద్యుత్ ఉన్నట్లు గ్రహించని నరేందర్ పెన్సింగ్ తీగకు విద్యుత్ ప్రసారం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్ఐ పీవీఎన్ రావు కేసు నమోదు చేసి దర్యా ప్తు చేపడుతున్నట్లు తెలిపారు. నరేందర్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

చింతకాని : మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో రైతు వడ్డే భాస్కర్‌రావు (67) విద్యుదాఘాతంతో సోమవారం మృతిచెందాడు. ముదిగండ మండల పమ్మి గ్రామానికి చెందిన భాస్కర్‌రావు కొంత కాలంగా పందిళ్లపల్లిలోని చిన్నకుమార్తె ఇంటి వద్ద ఉంటూ మూడెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. సోమవారం పొలం వద్ద కంప చెట్లను తొలగిస్తుండగా వ్యవసాయ విద్యుత్ మోటారుకు ఉన్న తీగకు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పక్క పొలంలో ఉన్న రైతు గుర్తించి విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుని భార్య సరోజినీ ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురి దుర్మరణం



కళ్యాణ్(ఫైల్)

కొణిజర్ల, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): కారును, ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టిన సంఘటనలో కారు నడుపుతున్న యువకుడు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఆదివారం అర్ధరాత్రి మండలంలో జరిగింది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని చిన్నమునగాలలో తాత వద్ద ఉంటున్న రాయల కళ్యాణ్(19) అనే యువకుడు పల్లిపాడు సమీపంలోని ఓ కారు గ్యారేజీలో మెకానిక్‌గా పని చేస్తున్నాడు. రాత్రిపూట పని ముగించుకొని చిన్నమునగాలకు కారులో వెళ్తుండగా ఎదురుగా వైరా వైపు నుంచి ఖమ్మం వైపు వస్తున్న బీఎస్ఆర్ ట్రావెల్ బస్సు కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కళ్యాణ్ తీవ్రగాయాలతో అక్కడకక్కడే మృతి చెందాడు. మృతుడి తాత కోటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా ట్రావెల్ బస్సులో ప్రయాణిస్తున్న 15 మందికి స్వల్పగాయాలయ్యాయి.

మరో ప్రమాదంలో....

ద్విచక్ర వాహనాన్ని లారీ వెనకనుంచి ఢీకొట్టిన సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొణిజర్ల సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం మామిడిగుండాల గ్రామానికి చెందిన ముక్తి భూపతి(38) ఓ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలో మార్కెటింగ్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వైరాలో మార్కెటింగ్‌లో భాగంగా ఏజెంట్ల శిక్షణకు హాజరైయ్యాడు. అనంతరం తిరిగి ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా కొణిజర్ల మండల పరిషత్ కార్యాలయం సమీపంలో వెనుక నుంచి వస్తున్న కంటైనర్ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భూపతి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుర్లు, కుమారుడు ఉన్నారు. మృతుడి సోదరుడు విజయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గల్లంతైన అన్నదమ్ముల మృతదేహాలు లభ్యం

చింతకాని, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన మత్స్యకారులైన కంభం నాగేశ్వరరావు (62), అతడి సోదరుడు కంభం సత్యం(58) గ్రామ సమీపంలోని రెడ్డి చెరువులో ఆదివారం గల్లంతైన విషయం తెలిసిందే. రెడ్డి చెరువులో గల్లంతైన అన్నదమ్ముల కోసం గ్రామస్థులు సోమవారం తెల్లవారుజామున గాలించడంతో చెరువు కట్టకు కొంత దూరంలో మృతదేహాలు లభ్యమయ్యాయి. మృతదేహాలను గ్రామస్థుల సహాయంతో ఒడ్డుకు చేర్చిన పోలీసులు అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను గ్రామానికి తరలించి కుటుంబ సభ్యులు అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు నిర్వహించారు.

అన్నదమ్ముల మృతిపై అనుమానం..

తమ వారి మృతిపై అనుమానం ఉందంటూ మృతుల కుటుంబ సభ్యులు అనుమానం ఉందంటూ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెడ్డి చెరువుకు సంబంధించిన లీజు విషయంలో రెండు వర్గాల నడుమ పెద్దల సమక్షంలో పంచాయతీలు నడుస్తున్నాయని ఓ వర్గం సంబంధించిన ముగ్గురిపై అనుమానం వ్యక్తం చేస్తున్నామని మృతుడు నాగేశ్వరరావు కుమారుడు వెంకటేశ్వర్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్ఐ నాగుల్‌మీరా దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

సాగర్ కాల్వలో పడి వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాల్వలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం ఖమ్మం నగరంలో జరిగింది. నిజాంపేటకు చెందిన దాసరి రామకృష్ణ (43) తన బంధువు అంతక్రియల్లో పాల్గొనేందుకు వేణుగోపాల్‌నగర్-1 వచ్చి సమీపంలోని సాగర్ కాల్వలో కాళ్లు కడుక్కునేందుకు దిగాడు. అక్కడ ప్రమాదవశాత్తు జారి కాల్వలో మునిగిపోయాడు. టేకులపల్లి సమీపంలో మృతదేహం గుర్తించారు. దీంతో కుటుంబ సభ్యులు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు కేసునమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

డెంగ్యూతో వృద్ధురాలు...

మణుగూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): డెంగ్యూ జ్వరంతో వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండల పరిధిలోని సమితి సింగారం వివేకానందనగర్‌లో నివాసముండే నాయిని సైదమ్మ (55) డెంగ్యూ జ్వరంతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సీపీఎం నాయకులు నెల్లూరి నాగేశ్వరరావు దామెళ్ల వెంకన్న, పిట్టలనాగమణి, గౌరి, నైనారపు నాగేశ్వరరావు, నరసయ్యలు సైదమ్మ మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు.

సింగిరెడ్డిపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ మోటార్ల చోరీ

- రూ.30 లక్షలపైనే నష్టం జరిగినట్లు అధికారుల అంచనా



పినపాక, 4 ఆగస్టు (ఆంధ్రజ్యోతి): సింగిరెడ్డిపల్లి గ్రామంలోని లిఫ్ట్ విద్యుత్ మోటార్లు ఆదివారం రాత్రి చోరీకి గురయ్యాయి. సాగునీటి అవసరాలకు ఎంతగానో ఉపయోగపడుతున్న ఈ మోటార్లను ప్రారంభించేందుకు రైతులు కాలువలు బాగు చేసుకుని, సోమవారం ప్రారంభించుకుందామనే తరుణంలో ఇలా విద్యుత్ మోటార్లు చోరీకి గురవడంతో రైతులు ఆందోళనలో పడ్డారు. ఈ మోటార్లకు వినియోగించిన కాపర్, ఆయిల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఆయకట్టు రైతులు చెబుతున్నారు. దొంగిలించిన విద్యుత్ మోటార్లను తిరిగి పునర్ నిర్మించేందుకు సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు ఉంటుందని అంచనా వేస్తున్నారు. సాగునీరు కోసం లిఫ్ట్ మోటార్లను ఆన్ చేసే క్రమంలో ఇలా చోరీకి గురవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికుల సహకారం లేకుండా గ్రామంలో నుంచి అంత భారీ సామాగ్రిని తరలించడం సాధ్యం కాదనేది కొందరి రైతుల వాదన. ఇటీవల అర్ధరాత్రి ఓ గుర్తు తెలియని వాహనం గ్రామంలోకి వచ్చిందని, గ్రామంలో కోళ్లఫారం వద్ద కాపలా ఉండే వ్యక్తి సదరు వాహనాన్ని చూసినట్లు తెలుస్తోంది. సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ సురేష్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి, వివరాలు సేకరించారు. ఇరిగేషన్ అధికారులు ఇంత ఘటన జరిగినా పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడం గమనార్హం.

పాఠశాలలో విద్యుత్ మోటార్...

జూలూరుపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని దండుమిట్టంతడా ప్రాథమిక పాఠశాలలో విద్యుత్ మోటార్ చోరీకి గురైంది. దీంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు వెనక వైపునుంచి పాఠశాలలోకి చొరబడి రూ.10వేలు విలువ చేసే మో టార్‌ను ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం హెచ్‌ఎం, గోపాల్, ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చేసరికి పైపులు పీకి ఉండటం గమనించారు. విద్యుత్ మోటార్ చోరీకి గురైందని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

నీటితొట్టిలో పడి రెండున్నరేళ్ల బాలిక మృతి

- కన్నీటి పర్యంతమైన కుటుంబసభ్యులు, బంధువులు
- పెద్దతండా గ్రామంలో చోటుచేసుకున్న సంఘటన



రోదిస్తున్న తల్లి సరస్వతి

జూలూరుపాడు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : ఆడుకుంటూ వెళ్లి ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి భద్రాద్రికొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని మాచినేనిపేటతండా పంచాయతీ పరిధి పెద్దతండా గ్రామానికి చెందిన రెండున్నరేళ్ల బాలిక భూక్యా తన్విశ్రీ మృతిచెందింది. సోమవారం సాయంత్రం జరిగిన ఈ సంఘటన గురించి స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలివీ. పెద్దతండా గ్రామానికి చెందిన సరస్వతికి కొన్నేళ్ల క్రితం మహబూబాబాద్ జిల్లా గార్లకు చెందిన భూక్యా గోపనాయక్‌తో వివాహం జరిగింది. ఈ దంపతులకు రెండున్నర ఏళ్ల కూతురు తన్విశ్రీ, ఎనిమిది నెలల బాబు తన్విష్ ఉన్నారు. కాగా వీరు పెద్దతండా గ్రామంలోనే నివాసం ఉంటూ కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరు ఉండే ఇంటి సమీపంలోనే బాలిక అమ్మమ్మ జ్యోతి ఇల్లు ఉంది. ఈ క్రమంలోనే తల్లి సరస్వతి తన ఇద్దరు పిల్లలను తీసుకుని పక్కన ఉన్న తల్లి జ్యోతి వాళ్ల ఇంటికి వెళ్లింది. ఆ సమయంలో అక్కడికి వచ్చిన బంధువులతో సరస్వతి మాట్లాడుతుండగా తన్విశ్రీ ఆడుకుంటూ వెళ్లి అమ్మమ్మ ఇంటి ఆవరణలో ఉన్న నీటి తొట్టిలో పడింది. తన కూతురు కనిపించకపోవడంతో ఆందోళన చెందిన సరస్వతి, బంధువులు వెతకగా.. ఎక్కడా కనిపించకపోవడంతో అనుమానం వచ్చి నీటి తొట్టి వద్దకు వెళ్లి చూడగా బాలిక కనిపించింది. వెంటనే బాలికను జూలూరుపాడులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యుడు అప్పటికే ఆమె మృతి చెందినట్టు నిర్ధారించారు. బాలిక మృతితో తల్లిదండ్రులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.



తన్విశ్రీ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

పోయిందనుకున్న బంగారం దొరికింది

- చోరీ జరిగిందని బాధితుల ఫిర్యాదు
- ఇంటి బాత్‌రూంలోనే దొరికిన ఆభరణాలు
- వైరా తొమ్మిదో వార్డులో కలకలం

వైరా, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : చోరీ జరిగి.. పోయిందనుకున్న బంగారం దొరికింది. తొలుత బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. రంగంలోకి దిగిన పోలీసులు బాధితుల ఇంట్లో సోదాలు జరిపారు. చివరకు సాయంత్రానికి బాధితుడి కూతురు ఇంట్లో వెతకగా బాత్‌రూంలో ఉంచిన ప్యాంటు జేబులో ఆభరణాలు లభ్యమయ్యాయి. అప్పటికే పట్టణంలో ఈ విషయం కలకలం రేపగా.. చివరకు ఆభరణాలు దొరికడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. వైరాలో విశ్రాంత ఇంటిలిజెన్స్ ఎస్ఐ, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అయిన బీడీకే రత్నం.. కొన్నేళ్ల కిందట భార్య ఆ తర్వాత తల్లి మరణించడంతో వైరా 9వ వార్డులో ఓ ఇంట్లో ఒంటరిగా అద్దెకు నివాసం ఉంటున్నాడు. అయితే భార్య, తల్లికి చెందిన రూ.20లక్షల విలువైన 22.5తులాల బంగారు ఆభరణాలు ఆయన వద్దే ఉండగా.. గతనెల 31న వాటిని ఓ ప్యాంటు జేబులో పెట్టి దాన్ని సెల్ఫ్‌లో ఉంచాడు. ఆ తర్వాత ఈనెల ఒకటిన తమిళనాడు రాష్ట్రంలోని వేలంగిని చర్చిలో మొక్కులు తీర్చుకొనేందుకు వెళ్లి మూడోతేదీ తిరిగొచ్చాడు. సెల్ఫ్‌లో ఉన్న ప్యాంట్ కోసం వెతగ్గా.. కన్పించకపోవడంతో వైరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దాంతో స్పందించిన ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, సీఐ ఎన్.సాగర్, ఎస్ఐ పి.రామారావు, ప్రొబిషనరీ ఎస్ఐ వి.పవన్ ఖమ్మం నుంచి క్లూస్‌టీం రప్పించి వేలిముద్రలు సేకరించారు. ఇదిలా ఉంటే సోమవారం సాయంత్రం రత్నం ఇంటికి వచ్చిన ఆయన రెండో కుమార్తె ఇంట్లో వెతగ్గా.. ఇంటి వెలుపల ఉన్న బాత్‌రూంలో ఉన్న ప్యాంటు జేబులో బంగారంతో ఉన్న పర్సు కనిపించింది. దాంతో ఊపిరిపీల్చుకున్న రత్నం రత్నం వెంటనే వైరా ఏసీపీ ఎంఏ రెహ్మాన్‌కు సమాచారం ఇచ్చారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు ఉరుకులుపరుగులు పెట్టగా.. భారీ చోరీ జరిగిందన్న విషయం పట్టణం వ్యాప్తంగా సంచలనం రేపింది.

భద్రాద్రి విద్యాశాఖ సీనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్

కొత్తగూడెం ఎడ్యూకేషన్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఎం. అప్పారావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ రీజనల్ జాయింట్ డైరెక్టర్ కే. సత్యనారాయణ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించడం, అంతర్గత సమాచారాన్ని బయట వ్యక్తులకు అందజేయడం వంటి కార్యకలాపాలకు పాల్పడినందుకు గాను జిల్లా కలెక్టర్ సూచన మేరకు ఆయనను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కొనసాగుతున్న లారీ యజమానుల ఆందోళన

- స్థానిక లారీలకు బొగ్గు లోడింగ్ ఇవ్వాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న లారీ యజమానులు

సత్తుపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి):స్థానిక లారీలకు సింగరేణి సంస్థ బొగ్గు లోడింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సత్తుపల్లి లారీ, టిప్పర్ యజమానుల అసోసియేషన్ ఆధ్వర్యంలో లారీ యజమానులు ఆందోళన చేస్తున్నారు. ఇందులో భాగంగా సత్తుపల్లిలోని సింగరేణి ఓపెన్ కాస్టు బొగ్గు గని నుంచి ఆర్‌సీహెచ్‌పీకి విజయవాడకు చెందిన కాంట్రాక్టు సంస్థ ద్వారా జరుగుతున్న బొగ్గు రవాణాను అడ్డుకున్నారు. గత మూడు రోజులుగా ఆర్‌సీహెచ్‌పీకి బొగ్గు లోడింగ్, రవాణా జరగకుండా లారీ యజమానులు అడ్డుకొని నిరసన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం కూడా తమ ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా లారీల యజమానులు మాట్లాడుతూ జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాలను ఖాతరు చేయకుండా రోడ్డు మార్గంలో పెద్ద మొత్తంలో బొగ్గు రవాణా చేస్తున్నారని ఆంధ్రాకు చెందిన కాంట్రాక్టరు కేవలం మూడు నెలలు పాటు బొగ్గు రవాణా అప్పగించామని చెబుతూ ఏడాది కొనసాగించారని, ప్రస్తుతం కాంట్రాక్టు ముగిసినా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. సింగరేణి స్థానిక లారీలకు 30శాతం లోడింగ్ ఇవ్వాల్సి ఉన్నా అధికారులు లోడింగ్ ఇవ్వటం లేదని ఆరోపించారు. సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌ను కలిసేందుకు లారీ యజమానుల అసోసియేషన్ బాధ్యులు కొందరు హైదరాబాద్ వెళ్లినట్లు నాయకులు తెలిపారు.

పర్సు అప్పగింత

బూర్గంపాడు, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): బూర్గంపాడుకి చెందిన మాడుగుల ప్రశాంత్ అనే ఆటో డ్రైవర్ సోమవారం భద్రాచలం వెళ్తుండగా మార్గమధ్యలో రెడ్డిపాలెం సమీపంలో పర్సును పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో అదే దారిలో భద్రాచలం ఆటోలో వెళ్తున్న ఖమ్మం జిల్లా కొణిజర్లకు చెందిన పెరిక రోషయ్య, చల్లా లక్ష్మీనారాయణ, బాధవత్ లలితలకు రోడ్డుపై పర్సు పడి ఉం డటం గమనించారు. దీంతో దానిలోని సుమారు 16,000రుపాయలు కింద పడి ఉండగా వాటిని తీసుకువచ్చి బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. పర్సులో ఉన్న కార్డుల ఆధారంగా ఎస్ఐ ప్రసాద్ బాధితుడికి అందజేశారు. కొణిజర్లకు చెందిన వ్యక్తులను పలువురు అభినందించారు.



బాధితుడికి పర్సును అందజేస్తున్న ఎస్ఐ, కొణిజర్ల వాసులు

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

- సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ నరసింహ



పిండివంటలను అందిస్తున్న కమిషనర్ నరసింహ

సత్తుపల్లిరూరల్, ఆగష్టు4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మహిళలు గరిటే తిప్పే ఆ చేతులతోనే ఆర్థిక స్వావలంభన సాధించాలని సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కే.నరసింహ ఆకాంక్షించారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో సత్తుపల్లి మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్వయం సహాయక సంఘ ఉత్పత్తులు ప్రదర్శన, అమ్మకాలను ఆయన సోమవారం ప్రారంభించారు. నేర్చుకోవాలన్న పట్టుదల ఉంటే మహిళలు నేర్చుకోలేని విద్య లేదన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాబూరావు, మెప్మా సిబ్బంది ప్రసాద్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



తల్లిపాలు శ్రేయస్కరం

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): పుట్టిన బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.నరేందర్, చిన్నపిల్లల వైద్యుడు బాబూరత్నాకర్ అన్నారు. సోమవారం తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. పుట్టిన ప్రతీ బిడ్డకు మొదటి సారి ఇచ్చే ముర్రుపాలు పట్టిస్తే ఆ శిశువులో రోగనిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ఆరునెలల వరకు తల్లిపాలు ఇవ్వడమే బిడ్డకు అంత్యంత శ్రేయస్కరమన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్ కుమార్, గైనకాలజీ హెచ్‌వోడీ యామిని, డాక్టర్. కిరణ్‌కుమార్, మిడ్వైఫరీలు, నర్సింగ్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మార్పు పేరుతో కాంగ్రెస్ మోసం

- గ్రామ వికాసం బీజేపీతోనే సాధ్యం
- రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు


మాట్లాడుతున్న వినోదరావు

నేలకొండపల్లి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): మార్పుపేరుతో తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ దారుణంగా మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర నాయకుడు తాండ్ర వినోదరావు విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో నేలకొండపల్లిలో నిర్వహించిన ఇంటింటి కార్యక్రమంలో వినోదరావు పాల్గొన్నారు. బతుకులు మారతాయన్న ఆశతో ప్రజలు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పట్టం గడితే, మార్పు రాలేదని, ప్రజల బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అంతర్గత కలహాలతో కొట్టుమిట్టాడుతుందన్నారు. అభివృద్ధి ఒక్కబీజేపీతోనే సాధ్యమని, తెలంగాణలో అధికారం బీజేపీదేనని వినోదరావు అన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు భవనాశి దుర్గారావు, జిల్లా నాయకుడు మన్నె కృష్ణారావు, మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్, షేక్.షర్ఫుద్దీన్, చావాకిరణ్, బాజా రామకృష్ణ, మన్నె రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల నివారణకు చర్యలు చేపట్టండి

డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటరెడ్డి

తిరుమలాయపాలెం,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో వ్యాపించే అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యసిబ్బంది పటిష్ట చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం మండలంలోని అజ్మీరతండాలో పర్యటించారు. విషజ్వరాలు, డెంగీ, మలేరియా రాకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. గ్రామాల్లో డెంగీ కేసులు నమోదవుతున్నాయని, ఇంటింటి సర్వే చేపట్టి రక్తనమూనాలు పరీక్ష చేయాలని తెలిపారు. హెల్త్‌క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రెహమాన్, ఏఎన్ఎం సీత, అనిత పాల్గొన్నారు.

నేలకొండపల్లి పీహెచ్‌సీ తరలింపు

- సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ఒకేచోట నిర్వహణ
- విధుల్లో అనేక లొసుగులు
- ఇటీవల కలెక్టర్ అనుదీప్ పర్యటనలో వెలుగులోకి
- వారంలో తరలించాలని నాడు కీలక ఆదేశాలు


నేలకొండపల్లి సీహెచ్‌సీలో హాజరు పట్టికను తనిఖీ చేస్తున్న కలెక్టర్ అనుదీప్ (ఫైల్)


నూతన భవనంలో పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న అధికారులు

నేలకొండపల్లి, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): దాదాపుగా పదేళ్లుగా ఉమ్మడిగా విధుల నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్‌సెంటర్(సీహెచ్‌సీ), ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లను ఎట్టకేలకు కలెక్టర్ ఆదేశాలతో అధికారులు విభజన చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న భవనంలో ఏర్పాటు చేశారు. గతనెల 25న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నేలకొండపల్లిలోని సీహెచ్‌సీ, పీహెచ్‌సీలను తనిఖీ చేశారు. కలెక్టర్ తనిఖీల్లో అనేక లొసుగులు బయటపడ్డాయి. విధుల్లో ఉండాల్సిన వైద్యులు కనపడలేదు. వైద్యుల వివరాలను అడిగితే పీహెచ్‌సీ అని సీహెచ్‌సీ అని పొంతన లేని సమాధానాలు చెప్పారు. దీంతో వారం రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లో పీహెచ్‌సీని సీహెచ్‌సీ ప్రాంగణం నుంచి వేరే భవనంలోకి మార్చాలని కలెక్టర్ తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లును ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేకపోతే ప్రైవేటు భవనంలోకైనా సరే మార్చాల్సిందేనని ఆదేశించారు. దీంతో మల్లగుల్లాలు పడిన అధికారులు ఎట్టకేలకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం పక్కనే ఉన్న విద్యార్థినుల వసతి గృహంలోకి మార్చారు. ఈ వసతిగృహం డిగ్రీ కళాశాల వద్ద నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాల్లోకి వెళ్లటంతో ఈ భవనం ఖాళీ అయింది. దీంతో పీహెచ్‌సీని సీహెచ్‌సీ నుంచి తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న భవనంలోకి మార్చారు. అదేవిధంగా వైద్యుల అన్ని డిప్యుటేషన్లను రద్దు చేస్తానని సీహెచ్‌సీని తనిఖీ చేసిన సమయంలో కలెక్టర్ హామీ చెప్పారు. డిప్యుటేషన్లను సైతం రద్దుచేసి పూర్తి స్థాయిలో వైద్యులను నియమించి మాట నిలబెట్టుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రారంభం ఏర్పాటులో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ మర్రి ఎర్రయ్య, వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, వైద్యులు అర్జున్, నాగమణి, సన, శ్రీకాంత్, ల్యాబ్ టెక్నీషియన్ ఈగా అనిల్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

త్రీటౌన్ పోలీసు స్టేషన్‌ను సందర్శించిన సీపీ



ఖమ్మంక్రైం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం త్రీటౌన్ పోలీసుస్టేషన్‌ను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సోమవారం సందర్శించారు. స్టేషన్‌నిర్వాహణ, పోలీసుల పనితీరు, సెక్టార్ అధికారుల విచారణ నివేదికలు, సీసీటీఎన్ఎస్ అప్లోడ్, జనరల్‌డైరీల రికార్డులు పరిసరాలను పరిశీలించారు. పిటీషన్ విచారణకు సంబంధించి సిబ్బందితో మాట్లాడారు. పోలీసుస్టేషన్ పరిధిలో నమోదయిన కేసులు, డయల్ 100 కాల్స్ ప్రతిస్పందన సమయం, సస్పెక్ట్‌షీట్‌లు, పెండింగ్ కేసులు పరిశీలించారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తూ వాహనాలు తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. పెట్రోకార్, బీట్‌డ్యూటీ సిబ్బంది ఏవిధమైన విధులు నిర్వహిస్తున్నారు, పాతనేరస్తుల నివాసాలను, కదలికలను ఏవిధంగా గుర్తిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు.

స్వాతంత్ర్య వేడుకలకు ఏర్పాట్లు చేయాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- వేడుకల నిర్వహణపై సమీక్ష


బీమా సొమ్మును అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మంకలెక్టరేట్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవ నిర్వాహణకు ఘనంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తో కలిసి వేడుకల నిర్వహణపై అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ప్రతీ విభాగానికి కేటాయించిన విధులను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రతీ శాఖ నుంచి ప్రశంసాపత్రాల పంపిణీ కోసం నిర్దిష్టమైన సంఖ్యలో మాత్రమే దరఖాస్తులు పంపించాలని కలెక్టర్ సూచించారు. ప్రశంసా పత్రాలు నిజంగా పనిచేసే సిబ్బందికి దక్కేలా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అన్నారు. జిల్లాలో జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై అన్ని శాఖల నుంచి బ్రీఫ్ నోట్స్ తెప్పించుకొని ముఖ్య అతిథి సందేశం తయారు చేయాలని జిల్లా పౌర సంబంధాల అధికారినీ ఆదేశించారు. ఆర్డీవో, ఆర్అండ్ బీ, మునిసిపల్ శాఖ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్ఓ ఏ.పద్మశ్రీ, జడ్పీ సీఈఓ దీక్షా రైనా, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సన్యాసయ్య జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

ప్రమాదవశాత్తు మరణించిన పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్‌కు రూ.10లక్షల బీమా సొమ్మును సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అందచేశారు. పంచాయతీలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ వీరస్వామి ప్రమాదవశాత్తు మృత్యువాతపడ్డాడు.గ్రామీణ ప్రాంతాల్లో మల్టీ పర్పస్ వర్కర్లుగా పని చేస్తున్న 2087 మంది కార్మికులకు పోస్టల్‌శాఖ ద్వారా ప్రమాద బీమా చేయించారు. ఏప్రిల్‌లో మరణించిన మల్టీపర్పస్ వర్కర్ వీరస్వామి నామినీ జి. జమలమ్మకు బీమా సొమ్ము రూ.10 లక్షల రూపాయలు అందించినట్లు కలెక్టర్ అనుదీప్ తెలిపారు.మల్టీపర్పస్ వర్కర్లకు ప్రమాద బీమా రెన్యువల్ సకాలంలో జరిగేలా చూడాలని కలెక్టర్ డీపీవోకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి శ్రీనివాసరెడ్డి, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత తదితరులు ఉన్నారు.

ఐదు నిమిషాల్లో మ్యుటేషన్లు ఇవ్వాలి

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
- సౌత్,నార్త్ జోనల్ కార్యాలయాల్లోనూ ప్రజావాణి

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు 4(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదులు తక్షణమే పరిష్కరించాలని, మ్యూటేషన్ పనుల కోసం ఆరునెలలుగా ఎందుకు తిప్పుకుంటున్నారని, ఐదు నిమిషాల్లో మ్యుటేషన్ మంజూరు చేయాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించారు. రైల్వేస్టేషన్ రోడ్డుకు చెందిన ఓ దరఖాస్తుదారుడు మ్యూటేషన్ పనిపై ప్రజావాణిలో కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.స్పందించిన కమిషనర్ సంబందిత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను వివరణ కోరారు. కావాల్సిన లింకు డాక్యూమెంట్లు తెప్పించి వెంటనే మంజూరు చేయించారు. అక్రమంగా నిర్మాణాలు జరుగుతున్న భవనాలను పలువురు ఫిర్యాదులు చేయటంతో వారి ఎదుటనే పట్టణ ప్రణాళిక అధికారులతో విచారణ చేశారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. తక్షణం చర్యలకు సంబంధిత అధికారులను పిలిపించి సమస్యలు పరిష్కారం తెలిపారు. కాగా స్థానికంగా జోనల్ కార్యాలయాలు అందుబాటులోకి రావటంతో ప్రజలు స్థానికంగానే అధిక ఫిర్యాదులు అందించారు. కార్పొరేటర్లు, నాయకులు జోనల్ కార్యాలయాలకు వెళ్లటంతో నగర పాలక సంస్థ కార్యాలయంలో ప్రజావాణికి తాకిడి తగ్గింది.

జోనల్ కార్యాలయాల పరిశీలన

నూతనంగాఅందుబాటులోకి వచ్చిన ఖమ్మం నార్త్ జోన్ బల్లేపల్లి, సౌత్ జోన్ పాత మున్సిపల్ కార్యాలయాల్లో అమలులోకి వచ్చిన ప్రజావాణి కార్యక్రమాన్ని కమిషనర్ పరిశీలించారు. జోనల్ వ్యవస్థపై స్థానిక కార్పొరేటర్లు, ప్రజలకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బల్లేపల్లి జోనల్ కార్యాలయంలో ప్రజలనుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. కొత్తగా జోనల్ కార్యాలయం ఏర్పాటుపై స్థానికుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేశారు. అనంతరం పాత మునిసిపల్ కార్యాలయంలో సౌత్‌జోన్ కార్యాలయంలో అధికారులకు పలు కీలక ఆదేశాలిచ్చారు. ప్రతీరోజు జోనల్ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమయ పాలన పాటించాలని సూచించారు. త్వరలో మరో మూడు జోనల్ కార్యాలయాలు ప్రారంభిస్తామన్నారు.




నార్త్‌జోన్ కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్, సౌత్ జోన్ లో సూచనలు చేస్తున్న అగస్త్య, కేఎంసీలో ఆదేశాలిస్తున్న కమిషనర్

రూ.4.50 లక్షల ఎల్‌వోసీ లేఖ అందజేత


ఎల్‌వోసీ లేఖను అందిస్తున్న తుమ్మల యుగంధర్

ఖమ్మంకార్పొరేషన్, ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): నగరంలోని ముస్తాఫా నగర్‌కు చెందిన కొంగర సైదేశ్వరరావు అనారోగ్యంతో చికిత్స పొందుతున్నాడు. పేదకుటుంబం కావటంతో కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్ సంబంధిత హాస్పటల్ వైద్యులతో మాట్లాడారు. ప్రభుత్వం నుంచి రూ.4.50లక్షల ఎల్‌వోసీ లేఖను అందించారు. సోమవారం హైదరాబాద్‌లో తుమ్మల యుగందర్ చేతుల మీదుగా సైదేశ్వరరావు కుటుంబ సభ్యులు ఎల్‌వోసీ లేఖను తీసుకున్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి

ఏదులాపురం మునిసిపల్ కమిషనర్

ఖమ్మంరూరల్,ఆగస్టు4(ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటి పరిధిలోని వార్డుల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందిని ఆదేశించారు. 1,2, 22 వార్డుల్లో 100 రోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న పనులను సోమవారం ఆయన పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వార్డుల్లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎన్.రఘు, జవాన్ షేక్ జమాలుద్దీన్ పాల్గొన్నారు.


పనులు పరిశీలిస్తున్న కమిషనర్

ఆలకించండి... పరిష్కరించండి

(5వపేజీ తరువాయి)

ఫైల్స్‌పై చర్చఉంటే వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా రివ్యూ కమిటీ సమావేశాలకు అందించే నోట్స్ బ్రీఫ్ గా ఉండాలని, అనవసరమైన సమాచారాన్ని ఇవ్వవద్దన్నారు. కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్‌వో ఎ.పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షా రైనా, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

● కొణిజర్ల మండలంతో పాటు వివిధ మండల గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల షెడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ పశువుల షెడ్లకు బిల్లులు చెల్లించాలని ఖమ్మం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు దొండపాటి రమేష్, టి.వెంకటేశ్వర్లు విజ్ఞప్తి చేశారు.

● వేంసూరు మండలం కల్లూరుగూడేనికి చెందిన ప్రజలకు పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదని, గ్రామంలో ఉన్న అనేకసమస్యలు పెండింగ్‌లో ఉన్నాయంటూ ఆ గ్రామస్థులు పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

● కొణిజర్ల గ్రామానికి చెందిన సుంకర నరసింహారావు సర్వే నెంబర్ 271లో అనుమతి లేకుండా వెంచర్ వేశారని, ఆ వెంచర్ వేయక ముందు అక్కడ నాగార్జునసాగర్ ప్రాజెక్టు మైనర్ పంట కాలువ ఉందని, ఆ కాలువను ఆక్రమించి వేసిన అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

తిరుమలాయపాలెం, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం మండలంలో పర్యటించనున్నట్టు మంత్రి కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర రెడ్డి తెలిపారు. తిరుమలాయపాలెం నుంచి పిండిప్రోలు వరకు నిర్మిస్తున్న బీటీ రోడ్డునిర్మాణ పనులకు శంకుస్థాపన, అనంతరం రైతువేదికలో కళ్యాణలక్ష్మీ చెక్కులు, రేషన్‌కార్డులు పంపిణీ చేస్తారని తెలిపారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

ఏదులాపురంలో సీపీఐ బలంగా ఉంది

పార్టీ రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ మహమ్మద్ మౌలానా


మాట్లాడుతున్న మౌలానా

ఖమ్మంరూరల్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలో సీపీఐ బలమైన శక్తిగా ఉందని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ మహమ్మద్ మౌలానా అన్నారు. మునిసిపాలిటీ పరిధిలోని సత్యనారాయణపురంలో సోమవారం మండల కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలన్నారు. ప్రజాసమస్యలపై సంస్థాగత పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని సూచించారు. ప్రతీ కార్యకర్త రానున్న ఎన్నికల్లో సైనికుల్లా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మండలకార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, జిల్లా సమితి సభ్యుడు భాస్కర్, కార్యవర్గ సభ్యులు చిన్న వెంకటరెడ్డి, అజ్మీర రాంమూర్తి, కర్ణకుమార్, ఉన్నం రంగారావు, సురేంద ర్, తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో త్రివేణి, న్యూఇరా, కిండర్ గార్డెన్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న న్యూఇరా పాఠశాల డైరెక్టర్స్ రమణారావు, భూమేశ్వరరావు, విద్యార్థులను అభినందిస్తున్న త్రివేణి డైరెక్టర్ గొల్లపూడి వేరేంద్రచౌదరి

ఖమ్మంస్పోర్ట్స్, ఆగస్టు4 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో జరిగిన సౌత్ ఇండియా కరాటే పోటీల్లో త్రివేని పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ వివరాలను పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వేరేంద్రచౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. తేజ,మోక్షిత, విహాస్, కీర్తన ప్రథమ స్థానం సాధించగా మహిధర్, విష్ణు, లోకేష్, బెన్సన్‌రాజు ద్వితీయస్థానం సాధించారు.యశస్విని, హర్షిత, చైత్రిక, జతిన్,శ్రీజయంత్, సత్యవర్ధన్‌తృతీయ స్థానాల్లో నిలిచారని తెలిపారు. విజేతలను అభినందించారు. న్యూఇరా విద్యార్థులు ప్రతిభ చూపారని పాఠశాలచైర్మన్ ఐవి. రమణారావు, డైరెక్టర్ భూమేశ్వరరావు తెలిపారు. వివాన్ శ్రేయస్, గగన్‌దీపక్, అనన్య, రీహ, అమీర్‌పాషా, సరయు, దిల్‌షాద్ స్వర్ణ పతకాలు సాధించారు. జయేన్స్, సోఫియాన్, గ్రీష్మశ్రీ ద్వితీయ, లక్షిత్‌సాయి, జస్విక, వశిష్ట, ఉన్నత్‌వర్ష, మనన్, మనోజ్‌కుమార్ తృతీయ బహుమతులు సాధించారని తెలిపారు. సోమవారం విద్యా ర్థులను అభినందించారు. కిండర్‌గార్డెన్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని ప్రిన్సిపాల్ లావణ్య తెలిపారు. రిషిక్ శ్రీహన్, అభినయ్, గౌతమ్‌విరాట్, తేజ్‌విరాట్, మోక్షశ్రీ, తక్షీల్ ప్రథమ,ద్వితీయ బహుమతులు సాధించారని ఆమె తెలిపారు. సోమవారం విజేతలను అభినందించారు.


విద్యార్థులతో ప్రిన్సిపాల్ లావణ్య

ఉన్నది పది.. పనిచేసేది ఒక్కటి!

(5వపేజీ తరువాయి)

కష్టాలు తప్పడం లేదు. మరి ఈ మిషన్లను మరమ్మత్తులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మూలన పడిన ఎక్స్‌రే ప్లాంటు...!

జిల్లాఆస్పత్రిలో ఎక్స్‌రే ప్లాంట్ కూడా మూలన పడింది. దాదాపు నెల కావస్తున్నా దీన్ని పట్టించుకునే వారేకరువయ్యారు. ఆస్పత్రిలో రోగల రద్దీకి తగినట్లుగా రెండు ఎక్స్‌రే ప్లాంట్లు ఉన్నాయి. కానీ ఒకటి మాత్రమే పనిచేస్తుంది. రోజుకు 170 నుంచి 200ఎక్స్‌రేలు తీస్తున్నారు. ఆర్థోపెడిక్, ఆస్తమా, ప్రమాదాల్లో గాయపడిన వారికి, సాధారణ పరీక్షలకు ఎక్స్‌రే తప్పని సరైంది. అయితే నలుగురు టెక్నీషియన్లు ఉన్నప్పటికీ ఒకేఒక ఎక్స్‌రే మిషన్ పనిచేస్తుండడంతో దానిపై భారం పడుతోంది. నెలరోజుల క్రితం మరో ప్లాంటు మరమ్మతులకు గురవ్వగా దానికి నేటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎక్స్‌రే ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

ప్రభుత్వ విధానాలు సరికాదు

రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి సుబ్బయ్య

ఖమ్మంచర్చికాంపౌండ్,జులై4(ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఉద్యోగుల విరమణ ప్రయోజనాలను విడుదల చేయకుండా మానసిక ఆందోళనకు గురిచేస్తున్న ప్రభుత్వ విధానాలు సరికాదని రిటైర్డు ఉద్యోగుల సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బయ్య తెలిపారు. సోమవారం నగరంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. న్యాయంగా రావాల్సిన కమ్యూటేషన్, గ్రాట్యుటీ, సరెండర్‌లీవ్, ఆర్జితసెలవు జీపీఎస్ తదితర బకాయిలు 16నెలలు అయినా విడుదల కావడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. అందుకే ఆగస్టు 15తర్వాత పెన్షనర్ల ఆకలియాత్ర పేరుతో ఛలో హైదరాబాదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈసమావేశంలో జిల్లా కార్యదర్శి తాళ్లూరి వేణు, జిల్లా కోశాధికారి డీకేశర్మ,ఆర్గనైజింగ్‌సెక్రటరి పి.సాంబశివరావు, కార్యదర్శులు ఖాజీ మోహినుద్దీన్, కూతురు కృష్ణమూర్తి, బాబురావు, జగన్మోహన్‌రావు, హనుమంతరావు, ఆదినారాయణ, గురవయ్య పాల్గొన్నారు.



అమ్మఒడి లాంటిదే అంగన్‌వాడీ

» సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



సామూహిక సీమంతం చేస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లి ఒడినుంచి పిల్లలను ధైర్యంగా పంపించినట్లయితే అంగన్‌వాడీలో టీచర్లు, ఆయాలు పౌష్టికాహారం అందిస్తారని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అన్నారు. సత్తుపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలోని అయ్యగారిపేట సెక్టార్‌లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలకు సీమంతాలు నిర్వహించిన తర్వాత అంగన్‌వాడీ సెంటర్‌కు యువ సేవా సమితి ఆధ్వర్యంలో అందించిన కుర్చీలను కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ఆమె చేతులమీదుగా పంపిణీ చేశారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నేడు ప్రభుత్వ పాఠశాలలు ఉత్తీర్ణతను సాధిస్తున్నాయని, మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో అంగన్‌వాడీ సెంటర్లలో పిల్లల ఆలనాపాలన ఉంటుందని, ఆరోగ్యంగా ఉండేందుకు ప్రభుత్వం పౌష్టికాహారాన్ని సమృద్ధిగా అందిస్తున్నట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు పాఠశాల ప్రారంభం నుంచే యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందించారని, ఇదే క్రమంలో అన్ని మౌలిక వసతులను కల్పిస్తున్నారని అన్నారు. పిల్లల భవిష్యత్ కోసం ఎన్నో ప్రణాళికలు వేసి నిధులు కేటాయిస్తున్నారని, ఇంగ్లీష్ మీడియంలో బోధనతోపాటు మంచి మెనూ అందిస్తూ ఆరోగ్య తెలంగాణ దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. అంతకముందు స్థానిక వెంగళరావు నగర్‌లో నూతనంగా ప్రతిష్ఠ జరుపుకున్న ముత్యాలమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

కోంద్రుపాడులో

పెనుబల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కోంద్రుపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని సూరయ్యబంజర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం చిన్నారులకు అన్నప్రాశన, గర్భిణీలకు సీమంతాలు, ప్రతిజ్ఞ, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మల్లీశ్వరి మాట్లాడుతూ.. రెండేళ్లపాటు బిడ్డకు తల్లిపాలు పట్టించాలని అప్పుడే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారవుతారని తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు భద్రకాళి, హేమలత, శైలాకుమారి, మనీషా, ఆశకార్యకర్త కుమారి, పాఠశాల హెచ్ఎం బాలాజీ పాల్గొన్నారు.

మడెంపల్లిలో

కారేపల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెద్దమడెంపల్లి, బాగ్యనగర్‌తండా, సామ్యాతండాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ఆరు నెలలు పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించడంతోపాటు, తల్లులకు చిన్నపిల్లలకు ఇచ్చే పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. బాలమృతం, టీ, హెచ్ఆర్ ఇవ్వడం జరిగిందన్నారు. సూపర్‌వైజర్లు గీతబాయి, మాలతికుమారి, టీచర్లు ప్రేమలత, కవిత, గర్భిణులు తల్లులు పాల్గొన్నారు.



అన్నప్రాశన నిర్వహిస్తున్న దృశ్యం



మడెంపల్లిలో..

దాతల సహకారాన్ని వినియోగించుకోవాలి

» అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి



బ్యాగులు అందజేస్తున్న అదనపు కలెక్టర్

మధిర రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): దాతలు అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకొని చదువుల్లో రాణించాలని జిల్లా అదనపు కలెక్టర్ పినిరెడ్డి శ్రీనివాసరెడ్డి విద్యార్థులకు సూచించారు. మధిర మండలం సిరిపురం గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కాళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏకరూప దుస్తులు, బ్యాగులను శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తాము ఏర్పర్చుకున్న లక్ష్యాలను చేరుకునే క్రమంలో అధ్యాపకుల మార్గదర్శనాన్ని పాటిస్తూ సమయపాలన పాటించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను అందిపుచ్చుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎస్ఎన్.శాస్త్రీ, కాళ్ల ఫౌండేషన్ అధినేత కాళ్ల అప్పారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యోగా శిక్షకురాలి కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న యోగా టీచర్లు

తల్లాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): గతనెల 24వతేదీన డెంగీతో అకాల మరణం చెందిన యోగా ఇన్‌స్ట్రక్టర్ కందుల శ్రీదేవి కుటుంబానికి తెలంగాణ యోగ టీచర్స్ కో ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందించారు. సోమవారం తల్లాడ మండలం రామచంద్రాపురం గ్రామంలో శ్రీదేవి దశదినకర్మ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు రూ.1.88లక్షల చెక్కును తెలంగాణ యోగటీచర్స్ కో ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సత్యరెడ్డి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీదేవి కుమార్తె చదువులు కోసం పెనుబల్లి హోమియోపతి ఆసుపత్రి యోగా మాస్టర్ చింతకింద రామకృష్ణ ప్రత్యేక దృష్టితో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యోగా ఇన్‌స్ట్రక్టర్లు, తెలంగాణ యోగా టీచర్స్ కో ఆర్డినేషన్ కమిటీ మహిళా సభ్యుల సహకారంతో రూ.1.88 లక్షలు సేకరించి ఆర్థికసాయం అదించామని తెలిపారు. ఈ సందర్భంగా యోగా టీచర్స్ కో ఆర్డినేషన్ కమిటీ నిర్వాహకులను సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అభినందించారు. శ్రీదేవి కుటుంబాన్ని ఆమె పరామర్శించి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేషన్ కమిటీసభ్యులు రవికుమార్, వినోద్, విశ్వబాహరాలీ, పద్మావతి, ఝాన్సీలక్ష్మి, పులబాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రపంచానికి పచ్చదనాన్ని ఇచ్చేద్దాం: ఎమ్మెల్యే



సత్తుపల్లిలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి ప్రపంచంలోని భవిష్యత్ తరాలకు పచ్చదాన్ని ఇచ్చేదామని సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి కోరారు. వనమహోత్సవంలో భాగంగా సత్తుపల్లి మునిసిపాలిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్అండ్‌బి గెస్ట్ హౌస్ వద్ద ఫుట్‌పాత్ వెంట మొక్కలు నాటే కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ కె.నరసింహా, ఏఈ సురేష్, సిబ్బందితోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లాడ మండలంలో పర్యటన

తల్లాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలో సోమవారం సత్తుల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టారాగమయి పర్యటించారు. మండలంలోని అన్నారుగూడెంలో కాంగ్రెస్ నాయకుడు మారెళ్ల మల్లిఖార్జునరావు అనారోగ్యానికి గురికాగా పరామర్శించారు. అన్నారుగూడెంలో ఇటీవల మరణించిన రమణ రాఘవయ్య, శెట్టి లక్ష్మీనారయణ, రామచంద్రాపురంలో కందుల శ్రీదేవి మృతిచెందగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీచైర్మన్ బాగం నీరజ, మాజీచైర్మన్ దీవెల కృష్ణయ్య, బ్లాక కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి, పాల్గొన్నారు.

ఆలయంలో నవగ్రహాల పునఃప్రతిష్ఠ



జమలాపురం ఆలయంలో సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం రెండోరోజుకు చేరుకున్నాయి. ఈ పవిత్రోత్సవాలలో భాగంగా ఎన్టీఆర్‌కృష్ణా జిల్లా మొరుసుమిల్లి గ్రామానికి చెందిన కళ్యాణం విష్ణువర్ధన్, శ్రీధర్ ఆర్థిక సహకారంతో ఆలయంలో నవగ్రహ విగ్రహాలను పనఃప్రతిష్ఠ చేశారు. ఉదయం ప్రాతఃకాల అర్చనలు మండపారాధనలు, అనంతరం అవామిత దేవతా హోమాల నిర్వహించారు. అనంతరం అధికభోగం నివేదిన చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. దేవాలయ సిబ్బంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈవో కె.జగన్మోహన్‌రావు, ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకుడు శ్రీనివాస్‌శర్మ, వేదపండితులు శ్రీవారి శాశ్వత దాతలు వెంకట సుబ్బారావు, చూడవత్తుల పాండురంగారావు, నండూరి శివాజీ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జమలాపురం గోపాలకిషన్‌రావు మృతి



ఎర్రుపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఎర్రుపాలెంకు చెందిన ప్రముఖ విశ్రాంత అధ్యాపకుడు, విద్యావేత్త, రచయిత జమలాపురం గోపాలకిషన్‌రావు(88) సోమవారం మృతి చెందారు. ఏపీలోని విజయవాడలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మండలంలోని ఎస్‌జేకేఎం జూనియర్ కళాశాల వ్యవస్థాపక ప్రిన్సిపాల్‌గా 8 ఏళ్లపాటు వ్యవహరించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా ఎందరో విద్యార్థులను తీర్చిదిద్దిప్రయోజకులను చేశారు. కవిగా, రచయితగా ఆయన చేసిన రచనలు అధ్యాపకులకే ఆదర్శంగా నిలిచాయి. తెలంగాన సాయుధ పోరాటంలో దక్కన్ సర్దార్‌గా పేరుగంచిన స్వాతంత్ర్య సమరయోధుడు జమలాపురం కేశవ రావు, గోపాలకిషన్‌రావుకు స్వయాన పినతండ్రి. దక్కన్ సర్దార్ దర్శన్, అంతరంగం లాంటి మరెనర్నో పుస్తకాలు రచించి ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందారు. 58వ ఏట ఓ ప్రముఖ సాహితీ సంస్థ ప్రజాబంధు అనే బిరుదు ప్రదానం చేసింది. పలువురు నివాళులర్పించారు.

ఆస్తుల పరిరక్షణకు భద్రత అవసరం: జీఎం



సీసీ కెమెరా ఆఫీస్‌ను ప్రారంభిస్తున్న జీఎం షాలెంరాజు

సత్తుపల్లిరూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సిరుల మాగాణి సింగరేణిలో సంస్థ ఆస్తుల పరిరక్షణకు భద్రత అవసరమని కొత్తగూడెం ఏరియా జీఎం షాలెం రాజు అన్నారు. స్థానిక జేవీఆర్ ఓసీలో నూతనంగా ఏర్పాటు చేసిన సెక్యూరిటీ నిఘా వ్యవస్థను ఆయన సోమవారం ప్రారంభించారు. సివిల్ ఏజీఎం రామకృష్ణ, పీవోలు ప్రహ్లాద్, ఎంవీ.నరసింహారావు, అధికారులు శ్రీనివాసరావు, సోమశేఖర్, రాజేశ్వరరావు, దేవదాసు, రవికుమార్, కార్మిక సంఘ నాయకులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కేశవరావు కుటుంబానికి పూర్వవిద్యార్థుల సాయం

తల్లాడ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో అనారోగ్యంతో మతిచెందిన గుమ్మా కేశవరావు కుటుంబానికి అన్నారుగూడెం హైస్కూల్‌లో 1991-92 బ్యాచ్ పది తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం రూ.51,500 ఆర్థికసాయం కేశవరావు కుటుంబ సభ్యులకు అదించారు. పూర్వవిద్యార్థులు ఉల్లి ప్రభాకరరావు, మంచికంటి శ్రీనివాసరావు, దిరిశాల బాబురావు, హనుమంతరావు, కొత్తపల్లి దానయ్య, ఇంజం నాగమణి పాల్గొన్నారు.

కారాయిగూడెంలో చేతిపంపులకు మరమ్మతులు



పెనుబల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కారాయిగూడెం గ్రామకాంగ్రెస్ అధ్యక్షుడు దూదిపాళ్ల ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం పంచాయతీలోని చేతిపంపులకు మరమ్మతులు నిర్వహించి ప్రజలకు తాగునీరు అందించారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఉన్నది పది.. పని చేసేది ఒక్కటి!

(5వపేజీ తరువాయి)

కష్టాలు తప్పడం లేదు. మరి ఈ మిషన్లను మరమ్మత్తులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మూలన పడిన ఎక్స్‌రే ప్లాంటు...!

జిల్లా ఆస్పత్రిలో ఎక్స్‌రే ప్లాంట్ కూడా మూలన పడింది. దాదాపు నెల రోజులు కావస్తున్నా దీన్ని పట్టించుకునే వారే కరువయ్యారు. ఆస్పత్రిలో రోగల రద్దీకి తగినట్లుగా రెండు ఎక్స్‌రే ప్లాంట్లు ఉన్నాయి. కానీ ఒకటి మాత్రమే పనిచేస్తుంది. రోజుకు 170 నుంచి 200ఎక్స్‌రేలు తీస్తున్నారు. ఆర్థోపెడిక్, అస్తమా, ప్రమాదాల్లో గాయపడిన వారికి, సాధారణ పరీక్షలకు ఎక్స్‌రే తప్పని సరైంది. అయితే నలుగురు టెక్నీషియన్లు ఉన్నప్పటికీ ఒకే ఒక ఎక్స్‌రే మిషన్ పని చేస్తుండడంతో దానిపై భారం పడుతోంది. నెల రోజుల క్రితం మరో ప్లాంటు మరమ్మతులకు గురవ్వగా దానికి నేటికీ పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎక్స్‌రే ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

విద్యార్థినుల అస్వస్థత ఘటనపై విచారణ జరపాలి

కల్లూరులో విద్యార్థి సంఘాల ధర్నా

కల్లూరు, ఆగష్టు4 (ఆంధ్రజ్యోతి) కల్లూరు గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు అస్వస్థతకు గురైన ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆశ్రమ పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిలు మాట్లాడుతూ వంట నిర్వహణ లోపంతోనే విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారని, ఈ సంఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ కల్లూరు డివిజన్ నాయకులు గోపి, ఉపేంద్రరామ్, విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

చోరీ జరిగిన ఇంటిని పరిశీలించిన ఏసీపీ రెహ్మాన్

మధిర రూరల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో నందిగామ బైపాస్ రోడ్డులో నివాసముండే కాంగ్రెస్ పార్టీ నాయకుడు చెరుకూరి నాగార్జున ఇంట్లో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత దొంగలు చొరబడి బంగారం, నగదు అపహరించుకుపోయిన విషయం తెలిసిందే. చోరీ జరిగిన ఇంటిని సోమవారం వైరా ఏసీపీ ఎంఏ.రెహ్మాన్, మధిర పట్టణ సీఐ రమేష్ సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని ఏసీపీ తెలిపారు.

అస్వస్థతకు గురైన విదార్థినులకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ



పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కల్లూరు, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని గిరిజన అశ్రమ బాలికల పాఠశాలలో అస్వస్థతకు గురియై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్స పొందుతున్న విద్యార్థినీలను సోమవారం కల్లూరు మండల బీఆర్ఎస్ శ్రేణుల బృదం పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటిసిలు కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘులు విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలోని పలు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో అందిస్తున్న భోజనం సక్రమంగా లేక సగటున ప్రతి రోజు విద్యార్థులు అస్వస్థతకు గురివుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం మొద్దునిద్ర పోతుందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పరిధిలోనే విద్యాశాఖ ఉన్న ఇలాంటి పరిస్థితులు ఏర్పడటం దురదృష్టకరమన్నారు. గురుకుల, గిరిజన విద్యావ్యస్థలను గత బీఆర్ఎస్ ప్రభత్వంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పటిష్ఠం చేస్తే అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తుందని బీఆర్ఎస్ శ్రేణులు విమర్శించారు. కల్లూరులోని ఆశ్రమ గిరిజన పాఠశాల వసతి గృహంలో తినే ఆహారంలో పురుగులు వస్తున్నాయని విద్యార్థినీలు బాధ్యులకు చెప్పిన వారు పట్టించుకోక పోవటం విచారకరమన్నారు. గిరిజన గురుకుల వ్యస్థను పటిష్ఠం చేస్తూ పేద విద్యార్థులకు మెరుగైన వసతి, నాణ్యమైన ఆహారం అందించేలా ప్రభుత్వం దృష్టి సారించాలని వారు డిమాండ్ చేశారు. వసతి గృహంలో ఆహరం తయారి లోపానికి బాధ్యులైన వారిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కాటంనేని వెంకటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, మేకల కృష్ణ, బొక్కా వెంకటేశ్వర్లు, సయ్యద్ రవూఫ్, వేము కృష్ణ, సిహెచ్ కిరణ్ పాల్గొన్నారు.

ఆలకించండి... పరిష్కరించండి

(5వపేజీ తరువాయి)



హాజరైన పిర్యాదుదారులు

ఫైల్స్‌పై చర్చ ఉంటే వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. జిల్లా రివ్యూ కమిటీ సమావేశాలకు అందించే నోట్స్ బ్రీఫ్ గా ఉండాలని, అనవసరమైన సమాచారాన్ని ఇవ్వవద్దన్నారు. కార్యక్రమంలో కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్‌యాదవ్, డీఆర్‌వో ఎ.పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షా రైనా, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి అందిన ఫిర్యాదుల్లో కొన్ని..

- కొణిజర్ల మండలంతో పాటు వివిధ మండల గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా పశువుల షెడ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం మంజూరు చేసిందని, ఆ పశువుల షెడ్లకు బిల్లులు చెల్లించాలని ఖమ్మం జిల్లా రైతు సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు దొండపాటి రమేష్, టి. వెంకటేశ్వర్లు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.
- వేంనూరు మండలం కల్లూరుగూడేనికి చెందిన ప్రజలకు పంచాయతీ కార్యదర్శి అందుబాటులో ఉండటం లేదని, గ్రామంలో ఉన్న అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయంటూ ఆ గ్రామస్థులు పలువురు కలెక్టర్‌కు పిర్యాదు చేశారు.
- కొణిజర్ల గ్రామానికి చెందిన సుంకర నరసింహారావు సర్వే నెంబర్ 271లో అనుమతి లేకుండా వెంచర్ వేశారని, ఆ వెంచర్ వేయక ముందు అక్కడ నాగార్జునసాగర్ ప్రాజెక్టు మైనర్ పంట కాలువ ఉందని, ఆ కాలువను ఆక్రమించి వేసిన అక్రమ వెంచర్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కలెక్టర్‌కు పిర్యాదు చేశారు.

ఇందిరమ్మ కమిటీలతో ప్రభుత్వానికి మరకలు



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఎర్రుపాలెం, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): సంక్షేమపథకాలు అమల్లో అర్హులను ఎంపికకోసం ఏర్పాటుచేసిన ఇందిరమ్మ కమిటీ నిర్వాకంతో కాంగ్రెస్ ప్రభుత్వం పై మరకలు అంటుతున్నాయని మండల సీపీఎం పార్టీ విమర్శించింది. మండలంలోని జమలాపురం గ్రామంలో రాజకీయాలకతీతంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంఆ అమలుచేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, వృద్ధాప్య పింఛన్లు వంటి సంక్షేమపథకాలు ఇందిరమ్మ కమిటీ అనుయాయులకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. ఈసదర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద పథకాలకుఅర్హులైన వారితో సోమవారం నిరసన తెలిపారు. ఈసదర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు వారధిలా పనిచేయాల్సిన ఇందిరమమ్మ కమిటీలు తమ ఇష్టానుసారంగా తమకు నచ్చినవారికే అందేలా చూస్తున్నారని వాపోయారుక. గ్రామంలో సంక్షేమపథకాలుకు అర్హులైన వారినుంచి దరఖాస్తులు స్వీకరించి వాటి పరిష్కారం కోసం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజవాణిలో సంంధిత అధికారులకు అందించారు. ఈకార్యక్రమలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య, మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్ నాయకులు సాంబశివరావు, పెద్దకోటేశ్వరరావు, పెసరమల్లి ఇమేలమ్మ, నాగులవంచ వెంకటరామయ్య, కూడలి నాగేశ్వరరావు, తాళ్లూరి వెంకట నారాయణ పాల్గొన్నారు.

మధిర నియోజకవర్గ కాంగ్రెస్‌లో నూతనోత్సాహం

» కొండబాల సహా కాంగ్రెస్‌లో పలువురి చేరిక

మధిర/బోనకల్, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మధిర నియోజకవర్గ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. మాజీ ఎమ్మెల్యే, కొండబాల కోటేశ్వరరావుతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు వివిధ పార్టీలకు చెందిన వందలాదిమంది కాంగ్రెస్‌లో చేరడంతో తమ పార్టీ మరింత బలోపేతం కానుందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కొండబాలతో పాటు బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్, మాజీ బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు, పలు గ్రామాలకు చెందిన వందలాది మంది సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్ గాంధీ భవన్లో వారంతా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. ఈ క్రమంలో బోనకల్ మండలంలోని పలు గ్రామాల నుంచి 25 వాహనాల ద్వారా హైదరాబాద్ వెళ్లారు. బీఆర్ఎస్ నుంచే అత్యధికంగా కాంగ్రెస్ పార్టీలోకి చేరగా.. నియోజకవర్గంలో బలమైన సామాజిక వర్గంతో పాటు బలహీన వర్గాల వారితో కొండబాలకు మంచి పరిచయాలున్నాయి. కొండబాల కాంగ్రెస్‌లో చేరడం ద్వారా నియోజకవర్గంలో మున్ముందు వలసలు మరిన్ని ఉంటాయన్న చర్చ జరుగుతుంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ తిరుగులేని విజయాలను సాధిస్తుందని అటు కొండబాల అభిమానులు, ఇటు కాంగ్రెస్ శ్రేణులు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే వేలాది కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభివృద్ధి విజన్‌కు ఆకర్షితులై చాలామంది నేతలు కాంగ్రెస్ బాట పడుతున్నారని చెబుతున్నారు.

కొండబాల వెంట వైరా నేతలు

వైరా, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలోని కొండకొడిమ, ముసలిమడుగు గ్రామాల్లోని పలు పార్టీలకు చెందిన నాయకులు మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావుతో కలిసి సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేష్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో కొండబాల కాంగ్రెస్‌లో చేరారు. ఆయనతో పాటు ముసలిమడుగు మాజీ సర్పంచ్ చింత నిప్పు కరుణాకర్‌రావు, కొండకొడిమ మాజీ ఎంపీటీసీ కొప్పుల వెంకటేశ్వరరావు, పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకు న్నారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించాలి



విద్యార్థినులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న అరుణాదేవి

ముదిగొండ, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించడంతోపాటు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పలు జాగ్రత్తలు తీసుకోవాలని ముదిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అరుణాదేవి సూచించారు. సోమవారం ముదిగొండ మండలం న్యూలక్ష్మీపురంలోని బాలికల హాస్టల్‌లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థినులు నెలసరి సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. జ్వరం వస్తే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రావాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు లత, పద్మావతి, ఏఎన్ఎం రత్నకుమారి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

పెనుబల్లి ఏపీఎంగా కల్పన



పెనుబల్లి, ఆగస్టు 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపాధి హామీ పథకం పెనుబల్లి మండల ఏపీఎంగా వి.కల్పన సోమవారం విధుల్లో చేరారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన ఏపీఎం జ్యోతిప్రసన్న సత్తుపల్లికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీఎం కల్పన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో క్షేత్రస్థాయి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీ అందరూ బాధ్యతాయుతంగా పనిచేసి మండలంలో ఉపాధి హామీ శాఖకు మంచి పేరు తెచ్చేందుకు సహకరించాలని కోరారు.